Follow: @ANNTELUGU
10-05-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 158 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## బలూచిస్థాన్ నేత స్వాతంత్ర్య ప్రకటన



- ఢిల్లీలో రాయబార కార్యాలయం కోసం భారత్‌కు విజ్ఞప్తి
- భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం

02

## ఆలయాల్లో పూజలు చేయాలి



- భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నాం
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

02

## అమల్లోకి పౌర రక్షణ చట్టం!



- అన్ని రాష్ట్రాలకు కేంద్ర సర్కార్ ఆదేశాలు
- అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం
- అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు హోంశాఖ లేఖలు

02



## 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో
# పాక్ దుశ్చర్య
### భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు

- దాయాది దేశం దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాం
- పాక్ వినియోగించే డ్రోన్ల ప్రయోగ కేంద్రాన్ని ధ్వంసం చేశాం
- భారత్ ప్రతి దాడులతో పాకిస్థాన్‌కు భారీ నష్టం
- పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం
- వివరాలు వెల్లడించిన విక్రమ్ మిస్రీ, సోఫియా, వ్యోమికా సింగ్

**ఢిల్లీ:** జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు.

మిగతా 3లో



## డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇద్దాం!

- రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం
- ప్రజాప్రతినిధుల నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని సుముఖత
- దీనిపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించాలని భట్టికి సూచన

వివరాలు 3లో



## భారత్, ఇరాన్ కీలక భేటీ!

- ఉద్రిక్త పరిస్థితుల వేళ ఆసక్తికర పరిణామం
- రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు
- పాక్ ఆక్రమిత కశ్మీర్ స్వాధీనంపై డిస్కషన్!
- రెండు వైపుల నుంచి పాక్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహం

వివరాలు 3లో




## రేపు టీజీఈఏపీ సెట్ రిజల్ట్స్
### విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 3లో

## ముక్కుసూటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 4లో



# బోర్డర్‌లో.. మళ్లీ టెన్షన్

## చీకటి పడితే చాలు.. దాడులకు దిగుతున్న పాకిస్థాన్


- సరిహద్దు 11 ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు.. వార్ సైరన్ మోగించిన భారత సైన్యం
- తాజా పరిస్థితులపై ప్రధాని మోడీ నివాసంలో కీలక సమావేశం
- ముప్పేట దాడిచేసినా.. వంకరబుద్ధి మార్చుకోని పాకిస్థాన్

జమ్మూ కాశ్మీర్‌లో మళ్లీ టెన్షన్ . చీకటి పడితే చాలు.. పాకిస్థాన్ చిల్లర వేషాలకు దిగుతోంది. భారత్ చేతిలో చావు దెబ్బ తిన్న పాక్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శుక్రవారం రాత్రి యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్, సాంబా, తంగదార్, సెక్టర్లలోని భారత సైనిక స్థావరాలపై కాల్పులకు తెగబడింది. ఓ వైపు కాల్పులు చేస్తూ.. మరోవైపు సరిహద్దులోని పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. పాకిస్తాన్ వరుస దాడుల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ను మరోసారి బ్లాక్ అవుట్ చేశారు. జమ్మూ టార్గెట్‌గా పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్ దాడులను భారత సైన్యం ధీటుగా ఎదుర్కొటోంది. యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్ సెక్టార్లలో పాక్ బలగాలు పాల్పులకు తెగబడ్డాయి. దీంతో సహనం నశించిన భారత సైన్యం.. ప్రతిదాడులకు దిగింది. ఎల్‌వోసీ సరిహద్దుల్లో వార్ సైరన్ మోగించినట్లు తెలుస్తోంది. - శ్రీనగర్

వివరాలు 2లో

## పూర్తిస్థాయి యుద్ధం వస్తే
# మళ్ళీ ఆర్మీకి వెళ్తా..

### భారత సైన్యం అద్భుతంగా దాడిచేసింది



- కామికాసీ డ్రోన్స్, రఫెల్ యుద్ధ విమానాలతో సైన్యం దాడి
- పీవోకేను ఇండియా తీసుకుంటే కశ్మీర్ సమస్య శాశ్వత పరిష్కారం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్

**హైదరాబాద్, మహా:** పూర్తిస్థాయి యుద్ధం వస్తే మళ్ళీ ఆర్మీకి వెళ్ళేందుకు తాను సిద్ధమని, దేశ సేవకు ఎపుడూ సిద్దంగా ఉంటానని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భారత్ పాక్ ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని, పరస్పర దాడులు జరుగుతున్న నేప్యంలో మంత్రి ఉత్తమ్ మీడియా చిట్ చాట్ లో పాల్గొన్నారు. పాకిస్తాన్ ఎటాక్ చేసిన అనేక ప్రాంతాల్లో తాను సంవత్సరాల పాటు పని చేసానని,

మిగతా 2లో

## కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టం



### హామీలు అమలు కోసం నిరంతరం పట్టుబడుతాం

- మార్పు మార్పు అని కాంగ్రెస్‌కు గుద్దారు ఇప్పుడు ఏమైంది?
- ఐదేళ్లు దివాళాకోరును అనుభవించాల్సిందే
- రేవంత్ రెడ్డి అంత నికృష్ట ముఖ్యమంత్రి ఎవరూ లేరు
- ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసింది శూన్యం
- త్వరలో ఉప ఎన్నికలు రావడం ఖాయం
- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్ ఇద్దాం
- ఖమ్మంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**ఖమ్మం, మహా:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు విని రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని, ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,

మిగతా 2లో

## నేటి నుంచే.. సుందరీమణుల సందడి

### మిస్ వరల్డ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి



- గచ్చిబౌలి స్టేడియంలో ఓపెనింగ్ సెర్మనీ
- రాష్ట్రంలో తొలిసారి మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ
- ప్రారంభించనున్న సీఎం రేవంత్, హాజరుకానున్న మంత్రులు
- 110 దేశాలకు చెందిన కంటెస్టెంట్ల రాక.. 150 దేశాల్లో టెలీకాస్ట్
- మూడంచెల భద్రత కట్టుదిట్టం చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సమయం దగ్గర పడింది. నేడు సాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు అధికారికంగా ప్రారంభమవుతున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసింది. అలాగే ఎయిర్ పోర్టుతో సహా హైదరాబాద్ నగరాన్ని రాష్ట్ర ప్రభుత్వం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసింది. ఇక శుక్రవారం వరకు 110 దేశాలకు చెందిన పోటీదారులు హైదరాబాద్‌కు చేరుకున్నారు.

మిగతా 2లో

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

- వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలి: ప్రెస్ అకాడమీ చైర్మన్
- వృత్తి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కులు అందజేత

03



## వీరుడా.. వందనం

### కశ్మీర్ బోర్డర్‌లో ఏపీ జవాన్ వీరమరణం

- పాక్ కాల్పుల్లో మృతి చెందిన మురళి నాయక్
- సంతాపం ప్రకటించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు
- శనివారం స్వగ్రామానికి రానున్న జవాన్ మృతదేహం
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో మురళి అంత్యక్రియలు

02



## ఐపీఎల్- 2025 వాయిదా

- వారం రోజుల పాటు పోస్ట్‌పోన్
- భారత్, పాక్ ఉద్రిక్తతల మధ్య బీసీసీఐ నిర్ణయం

వివరాలు 8లో






# ఆలయాల్లో పూజలు చేయాలి

- భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నాం
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని పూజలు నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టైంలో భారత సైనికులకు మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' రెండో దాడి విజయవంతం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆర్మీ బలగాలు సరిహద్దులో పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోరి మనమంతా పూజలు చేయడం సందర్భోచితమని పేర్కొన్నారు. తీవ్రవాదాన్ని యావత్ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నదని, ఏ రూపంలో ఉన్నా కఠినంగా వ్యవహరించాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణ మంత్రిగా కాదు.. దేశ పౌరురాలిగా, ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నానన్నారు. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. తాము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నామని, రానున్న రోజుల్లో కూడా ఉంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# బలూచిస్థాన్ నేత స్వాతంత్ర్య ప్రకటన

- ఢిల్లీలో రాయబార కార్యాలయం కోసం భారత్‌కు విజ్ఞప్తి
- భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం



**మహా:** పాకిస్థాన్‌లో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రముఖ రచయిత మీర్ యార్ బలోచ్, బలూచిస్థాన్ ప్రాంతం పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం పొందినట్లు సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. మీర్ యార్ బలోచ్ తన ప్రకటనలో పలు కీలక డిమాండ్లను అంతర్జాతీయ సమాజం ముందుంచారు. న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతించాలని ఆయన కోరారు. దీంతో పాటు, బలూచిస్థాన్‌లో శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని, తమ ప్రాంతానికి శాంతి పరిరక్షక దళాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. బలూచిస్థాన్ భూభాగం నుంచి పాకిస్థాన్ సైన్యం తక్షణమే వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా బలూచిస్థాన్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్నారని, పాకిస్థాన్ ప్రభుత్వం తమ సహజ వనరులను దోచుకుంటూ, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆయన గతంలో పలుమార్లు ఆరోపించారు. తాజా ప్రకటనతో బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఊపు వచ్చినట్లయింది.



# బోర్డర్‌లో.. మళ్లీ టెన్షన్

## చీకటి పడితే చాలు.. దాడులకు దిగుతున్న పాకిస్థాన్

### సరిహద్దు 11 ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు.. వార్ సైరన్ మోగించిన భారత సైన్యం
### తాజా పరిస్థితులపై ప్రధాని మోడీ నివాసంలో కీలక సమావేశం
### ముప్పేట దాడిచేసినా.. వంకరబుద్ధి మార్చుకోని పాకిస్థాన్

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్‌లో మళ్లీ టెన్షన్ . చీకటి పడితే చాలు.. పాకిస్థాన్ చిల్లర వేషాలకు దిగుతోంది. భారత్ చేతిలో చావు దెబ్బ తిన్న పాక్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శుక్రవారం రాత్రి యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్, సాంబా, తంగదార్, సెక్టర్లలోని భారత సైనిక స్థావరాలపై కాల్పులకు తెగబడింది. ఓ వైపు కాల్పులు చేస్తూ.. మరోవైపు సరిహద్దులోని పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. పాకిస్తాన్ వరుస దాడుల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ను మరోసారి బ్లాక్ అవుట్ చేశారు. జమ్మూ టార్గెట్‌గా పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్ దాడులను భారత సైన్యం ధీటుగా ఎదుర్కొటోంది. యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్ సెక్టార్లలో పాక్ బలగాలు పాల్పులకు తెగబడ్డాయి. దీంతో సహనం నశించిన భారత సైన్యం.. ప్రతిదాడులకు దిగింది. ఎల్‌వోసీ సరిహద్దుల్లో వార్ సైరన్ మోగించినట్లు తెలుస్తోంది. మరోవైపు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లలో హై-అలర్ట్ ప్రకటించారు.పరిస్థితి మరింత తీవ్రతరం కావడంతో సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సర్వీసులు నిలిపివేశారు. జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, చండీగఢ్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్‌కు ఈనెల 15 వరకు ఎయిరిండియా విమాన సర్వీసులు నిలిపివేశారు. మొత్తం 11 ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు తెగబడగా, భారత సైన్యం ధీటుగా ఎదుర్కొంటోంది. గురువారం రాత్రి 36ప్రాంతాల్లో 400కు పైగా డ్రోన్లను ప్రయోగించిన పాకిస్థాన్ శుక్రవారం రాత్రి కూడా మళ్ళీ అదే పద్ధతిలో కుటిలబుద్ధి చూపింది.



వివరాలు 2లో

## భారత్ అప్రమత్తం

సాంబా సెక్టర్, పోఖ్రాన్, ఫిరోజ్‌పూర్, పంజాబ్‌లోని పఠాన్ కోట్‌లో పాక్ డ్రోన్ దాడులకు పాల్పడగా.. వెంటనే అప్రమత్తమైన భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వాటిని గాల్లోని ధ్వంసం చేసింది. పాక్ దాడుల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జమ్మూతో పాటు పలు ప్రాంతాల్లో మళ్లీ వార్ సైరన్లు మోగాయి. పాక్ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్ అవుట్ ప్రకటించారు. పాక్ దాడులకు భారత సైన్యం ధీటుగా బదులిస్తోంది. ఓ వైపు పాక్ ఆర్మీ కాల్పులు తిప్పికొడుతూ.. మరోవైపు గగనతల రక్షణ వ్యవస్థతో పాక్ డ్రోన్లను తునాతునకలు చేస్తోంది. పాక్ కవ్వింపు చర్యలతో మరోసారి బోర్డర్‌లో యుద్ధ వాతావారణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్‌కు కౌంటర్‌గా గురువారం రాత్రి భారత్ పై పాక్ ఆకస్మిక దాడులకు పాల్పడింది. ఫైటర్ జెట్స్, మిస్సైళ్లు, డ్రోన్లతో భారత్ పై దాడులకు ప్రయత్నించింది. భారత సైనిక స్థావరాలు, ఎయిర్ పోర్టులు, ప్రార్థనా మందిరాలను ప్రధానంగా టార్గెట్ చేసుకుంది. పాక్ దాడులకు భారత సైన్యం ధీటుగా బదులిచ్చింది. భారత అమ్ములపొదిలో బ్రహ్మాస్త్రమైన ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో పాక్ ఫైటర్ జెట్లు, మిస్సైళ్లు, డ్రోన్ల భరత పట్టింది. గాల్లోని వాటిని ముక్కలు ముక్కలు చేసేసింది. పాక్ దాడులకు కౌంటర్ ఆ దేశంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసింది భారత్. లాహోర్లో పాక్ గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేయడంతో పాటు.. పాక్ రాజధాని ఇస్లామాబాద్ లో డ్రోన్లతో దాడి చేసి తమ సత్తా ఏంటో చూపింది. అంతేకాకుండా పాక్ కు జీవనాధారమైన కరాచీ పోర్టు పైన భారత్ ఎటాక్ చేసి.. పాక్ ను గడగడలాడించింది. ఇలా భారత్ చేతిలో ముప్పేట దాడికి గుర్రై చావు దెబ్బ తిన్న పాక్.. తన వక్రబుద్ధిని మార్చుకోకుండా మళ్లీ శుక్రవారం భారత్ పై దాడులకు ప్రయత్నించింది. వెంటనే అప్రమత్తమైన భారత్ పాక్ దాడులను ఎక్కడికక్కడ తిప్పికొడుతోంది. దీంతో మరోసారి ఇరు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.

## ప్రధాని మోదీ నివాసంలో కీలక భేటీ

భారత్ పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. భారత సరిహద్దుల్లో పాకిస్థాన్ డ్రోన్ దాడులు చేయడం, భారత భద్రతా దళాలు వాటిని ధీటుగా ఎదుర్కోవడం సహా తాజా పరిణామాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే పాక్ కవ్వింపు చర్యలకు భారత్ తీసుకోవాల్సిన చర్యలతో పాటు పాక్ ఎదురుదాడులను తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చ జరిగిందని తెలుస్తోంది.

# పూర్తిస్థాయి యుద్ధం వస్తే మళ్ళీ ఆర్మీకి వెళ్తా..

(మొదటిపేజీ తరువాయి)

భారత దేశ రక్షణలో చాలా చిన్న వయసులో మిగ్ 23 విమానాన్ని నడిపానన్నారు. ఇరవై సంవత్సరాలకే తాను యుద్ధ విమానాన్ని నడిపానని, మిగ్ 21 యుద్ధ విమానానికి తాను పైలెట్ గా పని చేసానన్నారు తాను మిలిటరీ పర్సన్ గా చెప్తున్నానని భారత సైన్యం అద్భుతంగా దాడి చేసిందన్నారు.. కామికాసీ డ్రోన్స్, రఫెల్ యుద్ధ విమానాలతో సైన్యం దాడి చేసిందని, డ్రోన్స్ పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్ళాయని, రఫెల్ మాత్రం ఇండియన్ భూభాగాన్ని క్రాస్ చేయలేదన్నారు. తాను ఎంపీగా ఉన్నపుడు పార్లమెంట్ డిఫెన్స్ కమిటీ సభ్యుడినన్నారు. 22 ఏప్రిల్ రోజు పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్ట్ అటాక్ హేయమైన చర్య అని, కుటుంబాలని కళ్ళ ముందు విడదీసి మతం అడిగి కాల్చి చంపారన్నారు. కశ్మీర్లో హిందూ ముస్లిం మధ్య విబేధాలు సృష్టించాలని ఉగ్రవాదులు ప్రయత్నం చేశారని, పహేల్గాం దాడి చేసిన రెసిస్టెన్స్ ఫ్రంట్ అనేది లష్కర్ ఏ తోయిబా కి ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అన్నారు. రఫెల్ విమానాన్ని కూల్చేశామని పాకిస్తాన్ చెప్పడం అబద్ధమని, రఫెల్ విమానం ఇండియన్ బార్డర్ క్రాస్ కూడా చేయలేదన్నారు. మన విమానాలు బార్డర్ క్రాస్ చేయకుండా వాళ్ళు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు.

**యుద్ధం భారత్ ఉద్దేశ్యం కాదు**

యుద్ధం చేయడం మన ఉద్దేశ్యం కాదని, కేవలం టెర్రరిస్ట్ క్యాంపులను మాత్రమే సైన్యం కొట్టేసిందని మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పాకిస్తాన్ దేశం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, పేరుకు ప్రజాస్వామ్య



దేశమైనప్పటికీ పాకిస్తాన్ ఆర్మీ మాత్రమే పాకిస్తాన్ ను నడిపిస్తుందన్నారు. పాకిస్థాన్ పతనానికి అంచున ఉన్నదని, యుద్ధం ఇలానే కొనసాగిస్తే కొలాప్స్ అవుతుందన్నారు.

**పీవోకేను ఇండియా తీసుకుంటేనే కశ్మీర్ సమస్య పరిష్కారం**

కశ్మీర్ విషయంలో ఒక చర్య జరిగితే తప్ప రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారం కాదని, పాక్ ఆక్రమిత కశ్మీర్ ను ఇండియా పరం చేస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ జమ్మూపై చేసిన దాడికి ఇండియన్ ఆర్మీ ప్రతిదాడి చేయడం సరైన చర్య అని, యుద్ధం కొనసాగితే పాకిస్తాన్ పతనం అవుతుందని, మూడవ దేశం ఏదీ కూడా యుద్ధం చేయడానికి ముందుకు రాకపోవచ్చన్నారు. పూర్తి స్థాయి యుద్ధం మొదలై, తన అవసరం ఉంటే తప్పకుండా ఆర్మీకి వెళ్తానన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టం



(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఐదేళ్లు దీని ఫలితం అనుభవించాల్సిందేనని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండల పరిధిలోని మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరి కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలు అమలు కోసం నిరంతరం పట్టుబడుతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు ముఖ్యమంత్రి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఢిల్లీ వెళ్తే దొంగల్లా చూస్తున్నారన్న రేవంత్‌ను.. దొంగను దొంగలా చూడకపోతే ఎలా చూస్తారని విమర్శించారు. గుడిలో చెప్పులు ఎత్తుకుపోయేవారిలా చూస్తున్నారనడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఢిల్లీ పార్టీలను నమ్ముకుంటే ఐదేళ్లు శిక్ష అనుభవించక తప్పదంటూ పేర్కొన్నారు. ఉన్న పథకాలను ఎత్తి వేస్తున్న ప్రభుత్వం కొత్త స్కీంలను ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్, రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్ పెంపు ఇలా ఎన్నో పథకాలు ఆగిపోయాయని విమర్శించారు.

**ఏం మార్పు జరిగింది..**

మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ప్రజల్లో ఎలాంటి మార్పు వచ్చిందో గమనించాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు కడితే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ నీళ్లు నెత్తిన చల్లుకున్నారే తప్ప.. చుక్క నీరివ్వలేదని ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసింది శూన్యమని, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. పాలేరులో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా భారీ మెజార్టీతో కందాళ ఉపేందర్ రెడ్డి గెలువడం ఖాయమని అన్నారు. భద్రాచలంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, మధ్యంతర ఎన్నికలకు జిల్లాలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆ స్థానాన్ని కైవసం చేసుకోవాలని సూచించారు. లింగాల కమల్ రాజ్‌ను ఓడించేందుకు భట్టి విక్రమార్క ప్రజలకు తప్పుడు హామీలిచ్చారని, బాండ్ పేపర్లు రాసి దేవుని గుడిలో పెట్టి ఎన్నికల్లో గెలిచిన భట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలని, అందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు గులాబీ పార్టీనే అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# అమల్లోకి పౌర రక్షణ చట్టం!

- అన్ని రాష్ట్రాలకు కేంద్ర సర్కార్ ఆదేశాలు
- అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం
- అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు హోంశాఖ లేఖలు

**ఢిల్లీ:** అవసరమైతే అత్యవసర అధికారులు ఉపయోగించుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. భారత్‌పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం హోం శాఖ లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 వినియోగించుకోవాలని లేఖలో పేర్కొంది. అయితే రూల్ 11 ప్రకారం సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం ఇస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని సరిహద్దు నగరాల్లో పాకిస్తాన్ దాడి చేస్తుందనే ముందస్తు సమాచారంతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో ప్రజలను అలర్ట్ చేయడానికి సైరన్‌లను భారత సైన్యం ఉపయోగిస్తుంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్‌గా ఉండి పౌరుల భద్రతకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉండాలని సూచనలు చేసింది. 1968లో భారత పార్లమెంట్ ఆమోదించిన పౌర రక్షణ చట్టం శత్రు దాడులు లేదా విపత్తుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడానికి అవసరమైన చర్యలను నిర్వహించడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ చట్టాన్ని మే 24, 1968 న ఆమోదించారు. యుద్ధం, బాహ్య దాడి, అంతర్గత అశాంతి, ఇతర శత్రు దాడుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడం ఈ చట్టం ఉద్దేశం.

# వీరుడా.. వందనం

## కశ్మీర్ బోర్డర్‌లో ఏపీ జవాన్ వీరమరణం

### పాక్ కాల్పుల్లో మృతి చెందిన మురళి నాయక్
### సంతాపం ప్రకటించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
### శనివారం స్వగ్రామానికి రానున్న జవాన్ మృతదేహం
### నేడు ప్రభుత్వ లాంఛనాలతో మురళి నాయక్ అంత్యక్రియలు



**మహా:** శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలంలోని కల్లితండాకు చెందిన అగ్నివీర్ జవాన్ మురళీ నాయక్ (24) వీరమరణం చెందారు. శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయిలకు మురళి నాయక్ ఒక్కరే సంతానం. జవాన్ మురళీ నాయక్ మృతితో, కల్లితండాలో అతని ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో విషాదఛాయలు అలుముకున్నాయి. మురళీ నాయక్ 2022 అక్టోబర్‌లో మొదటిసారి అగ్నివీర్‌కు సెలెక్ట్ అయ్యారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తుండగా, గురువారం రాత్రి చొరబాటుదారులను అడ్డుకునే క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ ఐదుగురు చొరబాటుదారులను హతమార్చారు. అక్కడ జరిగిన ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ వీరమరణం పొందారు.

**తెలుగు రాష్ట్రాల సీఎంలు సంతాపం..**

దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ శాసన సభ నియోజకవర్గం గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మురళీనాయక్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సీఎం వారిని పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల కాల్పుల్లో జవాన్ మురళి నాయక్ వీర మరణం పొందడం దిగ్భ్రాంతి కలిగించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జవాన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

# నేటి నుంచే సుందరీమణుల సందడి

## మిస్ వరల్డ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

### గచ్చిబౌలి స్టేడియంలో ఓపెనింగ్ సెర్మనీ..
### రాష్ట్రంలో తొలిసారి మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ
### ప్రారంభించనున్న సీఎం రేవంత్, హాజరుకానున్న మంత్రులు
### 110 దేశాలకు చెందిన కంటెస్టెంట్ల రాక.. 150 దేశాల్లో టెలీకాస్ట్
### మూడంచెల భద్రత కట్టుదిట్టం చేసిన ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభోత్సవంలో 2500 మంది పాల్గొననున్నారు. అందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. పాకిస్తాన్‌తో వార్ దృష్ట్యా స్టేడియంతో పాటు రాజధాని, పోటీదారులు సందర్శించనున్న 22 టూరిజం ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మిస్ వరల్డ్ పోటీలను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో తొలిసారి మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలను 150 దేశాల్లో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. దీంతో తెలంగాణ టూరిజంను ప్రమోట్ చేసేందుకు వేదికగా ఈ పోటీలను వినియోగించుకోవాలని, అందుకు అనుగుణంగా ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా స్వాగత ఏర్పాట్లు చేశారు. పోటీదారులు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన వెంటనే డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శన, కుంకుమ తిలకం దిద్ది స్వాగతించారు. వారికి ట్రిడెంట్ హోటల్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 110 దేశాల నుంచి పోటీదారులు హాజరయ్యారు. వారందరికీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించింది. గురు, శుక్రవారాల్లో పోటీదారులు రిహార్సల్స్ నిర్వహించారు.

**భద్రత కట్టుదిట్టం**

స్టేడియం వద్ద మూడంచెల భద్రతను ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని పోటీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. చిన్న సంఘటన జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిత్యం మానిటరింగ్ చేస్తుంది. అందులో భాగంగానే విమానాశ్రయం వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి, వారు ఉంటున్న హోటల్ వద్ద కూడా భద్రతను పెంచింది.

**2500 మంది ప్రతినిధులకు పాసులు**

ఈ ప్రారంభ కార్యక్రమానికి 2500 మంది ప్రతినిధులకు పాసులు ఇచ్చారు. సీఎం, మంత్రులతో పాటు 800 మంది వీఐపీలు, 300 మంది వరకు కంటెస్టులు, వారితో వచ్చిన వారు ఉండగా మిగిలినవారు మీడియా ప్రతినిధులు, కొంతమంది సామాన్య ప్రజలకు సైతం పాసులు



జారీ చేశారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 5.30 గంటల నుంచి స్టేడియం గేట్లు ఓపెన్ చేసి అతిథులకు ఎంట్రీ సదుపాయం కల్పిస్తారు. వీఐపీలకు 6.15 గంటలకు, 6.30 గంటలకు ప్రారంభ కార్యక్రమం స్టార్ట్ అవుతుంది. మ్యూజిక్‌తో తెలంగాణ ప్రభుత్వం, పోటీల నిర్వాహకులు, ఏయే దేశాల నుంచి పోటీదారుల గురించి వీడియో ప్రదర్శన చేయనున్నారు. సాయంత్రం 6.33గంటలకు సింగర్స్ రాష్ట్ర గీతం పాడనున్నారు. 6.36 గంటలకు 250 మందితో పేరిణి నృత్య ప్రదర్శన ఉంటుంది. 6.45 గంటలకు తెలంగాణ టూరిజంపై వివరించనున్నారు. 6.47 గంటలకు కొమ్ముకోయ నృత్య ప్రదర్శన, 7.06 గంటలకు గుస్సాడి నృత్యం, 7.27 గంటలకు లంబాడీ డ్యాన్స్, 7.45 గంటలకు ఒగ్గుడోలు నృత్య ప్రదర్శన, 8.04గంటలకు మిస్ వరల్డ్ కంటెస్టుదారుల వాక్, 8.06 ఇండియా ఫ్లాగ్, 8.12 గంటలకు జాతీయ గీతం, 8.17 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి పోటీలను ప్రారంభించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత పోటీలను నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్పర్సన్, సీఈవో జూలియా ఈవెలిన్ మోర్లీ సైతం ప్రసంగించనున్నారు. 8.24 గంటలకు కార్యక్రమం ముగియనున్నది.

# అభివృద్ధిలో ముందుకెళ్తున్నాం

## అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించొద్దు

**అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్**

**ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం**

**రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం**

**కుల సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది**

**ది హిందూ హడిల్స్ కార్యక్రమంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మాడల్‌ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ది హిందూ పత్రిక నిర్వహించిన ది హిందూ హడిల్స్ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు ప్రశ్నలకు విడమరిచి సమాధానాలిచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వాటిని సమగ్రంగా తెలియజేశారు.

### ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం..

'మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మా ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టాం. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యాం. రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పారిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, అటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశామని తెలిపారు. 'రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం. ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయి. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది. ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించాం. రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుంది. ఇది కేవలం బీసీల కోసమే కాదు. ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మాడల్‌ను అమలు చేయాలి. ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైంది.

### సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్

తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసొలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయం. జనాభాలో దాదాపు 60 శాతమున్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్ పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నాం. అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నాం. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టాం. డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నాం' అని అన్నారు.

## డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇద్దాం!

**రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం**

**ప్రజాప్రతినిధుల నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని సుముఖత**

**దీనిపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించాలని భట్టికి సూచన**



**హైదరాబాద్, మహా:**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు రాష్ట్ర ప్రజా ప్రతినిధులు తమ నెల జీతాన్ని విరాళంగా అందించాలని నిర్ణయించారు. పాక్ ముష్కరులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి అండగా నిలిచేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నెల జీతాన్ని విరాళంగా అందించాలని సీఎం రేవంత్ సూచించినట్లు తెలిసింది. దీనిపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి విరాళం ప్రకటించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బాధ్యతను అప్పగించారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించారు. సీఎం సూచన మేరకు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు.

### కంట్రోల్ రూమ్ ఏర్పాటు..


అలాగే సరిహద్దు రాష్ట్రాల్లోని తెలంగాణ వాసుల కోసం తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, సరిహద్దు రాష్ట్రాల్లో ప్రస్తుతం నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కంట్రోల్ రూంలో నిరంతరాయంగా సేవలు అందిస్తామని అధికారులు చెప్పారు. కంట్రోల్ రూం ల్యాండ్‌లైన్ ఫోన్ నంబరు : 011 23380556,వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ, లైజాన్ హెడ్ - 9871999044, హైదర్ అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు -9971387500,జి.రక్షిత్ నాయక్, లైజాన్ ఆఫీసర్ - 9643723157, సీహెచ్.చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ - 9949351270 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ కోరారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

**వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ .. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలి: ప్రెస్ అకాడమీ చైర్మన్**

**వృత్తి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కులు అందజేత**



**హైదరాబాద్, మహా:**

మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్లు ఎంతోమంది ఉన్నారని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేసి ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని విడతల వారీగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతోందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ. 22 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000తో పాటు ఐదేండ్ల వరకు నెలకు రూ. 3000 చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు రూ.1,000 చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని, తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని ఈ సందర్భంగా ఆయన మంత్రిని కోరారు.

## రేపు టీజీఈఏపీ సెట్ రిజల్ట్స

**విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా:** రేపు టీజీ ఈఏపీ సెట్ ఫలితాలను విడుదల కానున్నాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను రేపు ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫలితాలను విడుదల చేయనున్నట్లు సెట్ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్, ఈ నెల 2,3,4 తేదీల్లో మొత్తం ఆరు సెషన్లల్లో పరీక్షలు నిర్వహించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో 94 శాతం, ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 93 శాతం వరకు హాజరు నమోదైంది. ఈ ప్రవేశ పరీక్షల ద్వారా ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. విద్యార్థులు https://eapcet. tgche.ac.in వెబ్ సైట్ ద్వారా తమ ఫలితాలను చెక్ చేసుకోవాలని సూచించారు. ఈఏపీసెట్‌కు మొత్తం 3,06,796 మంది దరఖాస్తులు వచ్చాయి.

## భారత్, ఇరాన్ కీలక భేటీ!

**ఉద్రిక్త పరిస్థితుల వేళ ఆసక్తికర పరిణామం**

**రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు**

**పాక్ ఆక్రమిత కశ్మీర్ స్వాధీనంపై డిస్కషన్!**

**రెండు వైపుల నుంచి పాక్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహం**



**ఢిల్లీ:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఇండియాకు వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన భారత్‌కు విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న 20వ ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారత విదేశీ వ్యవహారాల శాఖ.. అరాగ్చీకి సాదర స్వాగతం పలికింది. ఈ నేపథ్యంలో నే జై శంకర్ తన ట్విట్టర్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో ' విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీకి సాదర స్వాగతం. ఆయన ఢిల్లీలో జరుగుతున్న ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొనడానికి వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 సంవత్సరాలు అవుతోంది. రెండు దేశాల మధ్య సంబంధాలను రివ్యూ చేసుకుని, మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తాం' అని వెల్లడించారు. పలు కీలక విషయాలపై రెండు దేశాల మంత్రులు చర్చించే అవకాశం ఉంది. ట్రేడ్, ఎనర్జీ, కనెక్టివిటీతో పాటు రీజనల్ కోఆపరేషన్‌పై చర్చ జరగనుంది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ తమదే అని దానిని తిరిగి పొందుతామని గత కొంత కాలంగా మన ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో దీనిపై కూడా చర్చించారని సమాచారం. ఇరాన్ పోర్టును ఆనుకొని బలుచిస్తాన్ ఉంటుంది. అందుకే రెండు వైపులా నుంచి పాక్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంలా కనిపిస్తున్నది. పాకిస్తాన్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్, ఇండియా చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## సైన్యం ఆపరేషన్ల కవరేజీలో జాగ్రత్త

**మీడియా సంస్థలకు రక్షణశాఖ సూచన.. కొంత సంయమనం పాటించాలని ప్రకటన**



**జాతీయం:**

దేశ భద్రతకు సంబంధించిన ఆపరేషన్ వార్తలు, దళాల కదలికల కవరేజీల విషయంలో మీడియా కొంత సంయమనం పాటించాలని రక్షణశాఖ ఓ ప్రకటనలో సూచించింది. భద్రతా దళాల ఆపరేషన్ల ఫలితాలను ప్రభావితం చేసే సమాచారాన్ని వెల్లడిస్తే.. వారి ప్రాణాలకు ముప్పు కూడా రావచ్చు. గతంలో కూడా కార్గిల్ యుద్ధం, 26/11 దాడులు, కాందహార్ హైజాక్ ఘటనలు అత్యుత్సాహపు రిపోర్టింగ్‌కు నిదర్శనగా నిలిచాయి. కేబుల్ టెలివిజన్ చట్టం ప్రకారం.. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల సమయంలో కేవలం అర్హత ఉన్న అధికారి సమయానుసారం బ్రీఫింగ్స్ ఇచ్చేందుకు అర్హులు. ఈ క్రమంలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించి.. సున్నితంగా, బాధ్యతాయుతంగా కవర్ చేయాలి'' అని పేర్కొంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా ఆపరేషన్ సిందూర్ వేళ తప్పుడు వార్తలు ప్రచారంలోకి రాకుండా చర్యలు తీసుకొంటోంది. పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌లు నిర్వహిస్తోంది. ఇంతకుముందు గుజరాత్‌లోని పోర్టు సహా, జలంధర్‌లో డ్రోన్, క్షిపణి దాడుల దృశ్యాలంటూ సోషల్ మీడియాలో పాక్ అనుకూల వ్యక్తులు వీడియోలు షేర్ చేసిన సంగతి తెలిసిందే. వీటిని భారత్ తిప్పికొట్టింది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి.. అవన్నీ అవాస్తవమనని తేల్చింది.



## 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య

**భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు**

**దాయాది దేశం దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాం**

**పాక్ వినియోగించే డ్రోన్ల ప్రయోగ కేంద్రాన్ని ధ్వంసం చేశాం**

**భారత్ ప్రతి దాడులతో పాకిస్థాన్‌కు భారీ నష్టం.. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం**

**వివరాలు వెల్లడించిన విక్రమ్ మిస్రీ, సోఫియా, వ్యోమికా సింగ్**

(మొదటిపేజీ తరువాయి)

భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. 'గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి.

**అనేక డ్రోన్లను కూల్చేశాం..**

వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్‌పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది' అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.

## ఆకాశ్ అద్భుతం

**పాకిస్థాన్‌పై ఉరుమై.. భారత ఆర్మీకి ఆయుధమై**




**మహా:** బోర్డర్ లో కొద్ది రోజులుగా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపిస్తోంది. తమ అమ్ములపొదిలోని ఆయుధాలతో చెక్ పెడుతోంది. డ్రోన్స్‌తో చేస్తున్న దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతోంది. అయితే వాటిలో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పాక్ డ్రోన్లను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించినంత పని చేస్తుంది మన మేడ్ ఇన్ ఇండియా ఆకాశ్ క్షిపణి వ్యవస్థ. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వాయు రక్షణ వ్యవస్థ ఆకాశ్ పాక్ డ్రోన్ దాడులను అడ్డుకోవడంలో కీలకంగా నిలిచిందని రక్షణ శాఖ అధికారులు తాజాగా తెలిపారు. "భారత లక్ష్యాలపై పాకిస్థాన్ చేసే డ్రోన్స్ దాడులను తిప్పికొట్టడంలో ఆకాశ్ గగనతల క్షిపణి వ్యవస్థను భారత సాయుధ దళాలు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారత సైన్యం, వాయుసేన రెండు కూడా పాక్ సరిహద్దు వెంబడి ఆ క్షిపణి వ్యవస్థను కలిగి ఉన్నాయి" అని రక్షణ శాఖ అధికారులు చెప్పారు.

**ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఒక మైలురాయి**

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, భూమి మీద నుంచి నేరుగా బహుళ లక్ష్యాలను మీడియం రేంజ్‌లో ఛేదించగలదు. రియల్ టైమ్ దాడులను కూడా వెంటనే గుర్తించి ప్రత్యర్థి ఎత్తులను ఆకాశ్ మిస్సైల్ సమర్థవంతంగా తిప్పికొట్టే సత్తా కలిగి ఉంది. అయితే ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఒక మైలురాయిగా నిలుస్తోంది.

**ఏ సైడ్ నుండి వచ్చినా ఖతమే**

దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి, శత్రువుల ప్రయత్నాలను విఫలం చేసేందుకు ఆకాశ్ క్షిపణి వ్యవస్థ నిరంతరం సన్నద్ధంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఆకాశ్ మిస్సైల్స్‌ను సమస్యాత్మక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మోహరించినట్లు చెప్పాయి. వాటితో భారత సైన్యం 50కి పైగా పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చివేసిందని వెల్లడించాయి. అయితే ఆకాశ్ క్షిపణి ఒకేసారి ఒకటికి మించి దూసుకొచ్చే మిస్సైళ్లు గానీ, డ్రోన్లను గానీ నేలకూల్చగలుగుతుంది. రియల్ టైమ్ మల్టీ సెన్సార్డ్ డేటా ప్రాసెసింగ్, దాడి తీవ్రతను అంచనా వేయగలదు. ఏ దిశ నుంచి దాడులు సంభవించినా ఒకేసారి ఛేధించగలదు. డ్రోన్లను చిత్తుచేయడంలో ఆకాశ్ వందశాతం స్ట్రైక్ రేట్ అందుకునే అవకాశాలు ఉన్నాయి.

Z కేటగిరీ

# ముక్కుసూటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**"కుక్క తోకను ఉపాలి గాని,తోక కుక్కను ఊపగూడదు" అని ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ గతంలో అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగుల గురించి వ్యాఖ్యానించారు. రెవెన్యూ శాఖ లేదా వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేస్తే సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి ఉద్యోగులు అల్టిమేటం జారీ చేసినప్పుడు కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులు,కార్మికులు,సాధారణ ప్రజలు,మేధావులు,జర్నలిస్టులు, ఇంజనీర్లు,అడ్వకేట్లు,ఇతర రంగాల్లో పనిచేస్తున్న మనుషుల గురించి కేసీఆర్ ఎప్పుడెప్పుడు ఏమి మాట్లాడారో,ఎంత అవమానించారో,ఎట్లా ఆత్మగౌరవాన్ని భంగం కలిగించారో వీడియోలు సజీవంగా ఉన్నాయి. కుక్కలు,తోకలు అంటూ రేవంత్ రెడ్డి ఉద్యోగులను ఎప్పుడూ తూలనాడలేదు.అవమానించనూ లేదు.**

''కుక్క తోకను ఉపాలి గాని,తోక కుక్కను ఊపగూడదు'' అని ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ గతంలో అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగుల గురించి వ్యాఖ్యానించారు.రెవెన్యూ శాఖ లేదా వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేస్తే సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి ఉద్యోగులు అల్టిమేటం జారీ చేసినప్పుడు కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ ఉద్యోగులపై,రెవెన్యూ సిబ్బందిపై కేసీఆర్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.ఆయన వాడిన భాషపై ప్రభుత్వ ఉద్యోగులు అప్పట్లో తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు.''ఉద్యోగులకు యజమాని ప్రభుత్వం. మా ఆదేశాలు పాటించాలి.అది వారి విధి. ప్రభుత్వాన్ని ఉద్యోగులు ఆదేశించలేరు''అని నాడు కేసీఆర్ ఫైర్ అయ్యారు.''సమైక్య రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసాం. ఎన్నోసార్లు సమ్మెలకు దిగడంతో పాటు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని కేసులు కూడా ఎదురుకున్నాం.ఏకంగా 40 రోజుల పాటు సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన విషయం కేసీఆర్ మర్చిపోయారు''అని ఉద్యోగ సంఘాలు అప్పట్లో అని గుర్తు చేశాయి.ఉద్యోగులు,కార్మికులు,సాధారణ ప్రజలు,మేధావులు,జర్నలిస్టులు, ఇంజనీర్లు,అడ్వకేట్లు,ఇతర రంగాల్లో పనిచేస్తున్న మనుషుల గురించి కేసీఆర్ ఎప్పుడెప్పుడు ఏమి మాట్లాడారో,ఎంత అవమానించారో,ఎట్లా ఆత్మగౌరవాన్ని భంగం కలిగించారో వీడియోలు సజీవంగా ఉన్నాయి. కుక్కలు,తోకలు అంటూ రేవంత్ రెడ్డి ఉద్యోగులను ఎప్పుడూ తూలనాడలేదు.అవమానించనూ లేదు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని 'తెలంగాణను కైలాసంలో పెద్ద పాము మిగినట్లు తయారైంది' అని ఒక సందర్భంలో కేసీఆర్ వ్యాఖ్యానించారు. ''రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయింది.ముమ్మందు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి వస్తుంది'' అని కేసీఆర్ ఏడాది కిందటే చెప్పారు.అంటే ఆయానాకు ఈ సంగతులన్నీ తెలుసునని అనుకోవాలి. కుండబద్దలు కొట్టారు.కేసీఆర్ కాకతాళీయంగా అలా వ్యాఖ్యానించలేదు.రాష్ట్ర ఆర్థికపరిస్థితి గురించి కేసీఆర్ కు సంపూర్ణ అవగాహన ఉన్నది.ఇబ్బడిముబ్బడిగా అప్పులు తెచ్చి ఉచిత పథకాలు,సంక్షేమ కార్యక్రమాల పేరిట ప్రజలకు విచ్చలవిడిగా నగదు పంచినందున తెలంగాణ దివాళా తీయకుండా ఎలా ఉంటుంది? కేసీఆర్ హయాంలోనే పెదపాము మింగినట్లుగా ఆర్థికపరిస్థితి తయారైన సంగతి బిఆర్ఎస్ నాయకులు ఎన్నడూ అంగీకరించరు. కానీ ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ ఖజానాను అప్పులతో ఎలా ఖాళీ చేశారో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు వివరరించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

తెలంగాణ ఆవిర్భావం నాటికి 75,577 కోట్ల అప్పులున్నాయని కేంద్రప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. అవి 202122 నాటికి 2.83 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థలు,కార్పొరేషన్ల ద్వారా లక్షా 50 వేల కోట్లు అప్పు తీసుకున్నారు. 12 బ్యాంకుల నుంచి కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు లక్షా 30 వేల కోట్లని కేంద్రప్రభుత్వం. 2022 అక్టోబర్ నాటికే తెలంగాణ రాష్ట్రానికి 4,33,817.6 కోట్ల అప్పు ఉన్నట్లు కేంద్రం నివేదిక వెల్లడించింది.2014 నుంచి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర రుణాన్ని భారీగా పెంచుకుంటూ పోయింది. 2014లో సుమారు 72,658 కోట్ల నుంచి 2024 నాటికి సుమారు 7.11 లక్షల కోట్లు పెరిగింది.ఈ కాలంలో రాష్ట్ర రుణం పదింతలు పెరిగింది.

''బాధ్యతగా వ్యవహరించాల్సిన మీరు బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించదు అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు.కానీ ఎక్కడా అప్పు పుట్టడంలేదు.రాష్ట్ర ప్రభుత్వం మన కుటుంబం. కుటుంబ పరువును బజారున పడేయొద్దు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచాలనే రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.నన్ను కోసినా వచ్చిన ఆదాయానికి మించి నేను ఏం చేయలేను.ఇప్పుడు కావాల్సింది సమరం కాదు. సమయస్ఫూర్తి, సంయమనం. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకు సమరం చేస్తారా?ప్రతీ నెలా ఏడు వేల కోట్లు ప్రతీ నెలా కట్టాల్సిన పరిస్థితి ప్రభుత్వానిది.గత పాలకులు 8500 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు పెట్టి వెళ్లారు కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. అవన్నీ వాళ్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టి వెళ్లిన బకాయిలే.కేవలం పదహారు నెలల్లో మేం 30 వేల కోట్ల నగదు రైతుల ఖాతాలకు బదిలీ చేశాం.ఉచిత విద్యుత్ అని చెప్పి విద్యుత్ శాఖకు బకాయిలు పెట్టి వెళ్లారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికి బకాయి పెట్టి వెళ్లారు.ప్రాజెక్టులు కట్టామని చెప్పి, కాంట్రాక్టర్లకు బకాయిలు పెట్టారు.11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా ?ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు సమరం అని అనడం సరైనది కాదు''అంటూ మే 5 న సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ఆవేదనా భరితంగా,ఉద్వేగపూరితంగా మాట్లాడారు.



**తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని ఇదివరకే 'కాగ్' ఆక్షేపించింది. బడ్జెట్ అప్పులు,బడ్జెట్ వెలుపల కార్పొరేషన్లకు గ్యారెంటీ ఇచ్చిన అప్పులు కలిపి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించిపోయాయని వెల్లడించింది. గ్యారెంటీ అప్పుల విషయంలో పారదర్శకత లోపించిందని, చివరికి వీటిని ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది.కార్పొరేషన్లకు ఎలాంటి ఆదాయం లేకపోయినా వాటి ద్వారా అప్పులు తీసుకుని,రాష్ట్ర ప్రభుత్వమే వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితిని తప్పుబట్టింది.**

**"ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం,వాళ్ళ విమర్శలకు బాధపడడం లాంటి ఉచ్చులో పడకుండా చూసుకోండి. పనికిమాలిన వాళ్ళ ఉనికిని పట్టించుకోకండి.వాళ్ళు సృష్టించుకున్న నరకంలో వాళ్ళే కుతకుత ఉడికిపోయేటట్లు వదిలేసి మీ పగ సాధించండి" ! అని ఎగమెమ్నాన్,ఎస్కిలన్ (క్రీస్తు పూ.525 - 456) అనే తత్వవేత్త అన్నాడు.ఆయన చెప్పినట్టుగానే ఎవరెన్ని విమర్శలు,ఆరోపణలు గుప్పించినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖాతరు చేయకుండా తన పంథాలో తాను పనిచేసుకుంటూ పోతున్నారు.**

ఇంకేముంది! ''రేవంత్ పనయిపోయింది.పరిపాలన చేతకాదని చెప్పేశాడు.అర్జెంటుగా దిగిపో! తెలంగాణ దివాళా తీయలేదు.కాంగ్రెస్ దివాళా తీసింది.రేవంత్ మెదడు దివాళా తీసింది.మేం అప్పులు చేసింది నిజమే.కానీ ఆ అప్పులతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంపద సృష్టించాం'' అని మే 6 న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గొప్పగా చెప్పారు.కేసీఆర్,కేటీఆర్ పరిస్థితి గోతికాడ నక్కల్లాగా అధికారం కోసం కాచుకొని కూర్చున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.రాష్ట్ర అభివృద్ధి కావాలా? అధికారం కావాలా?అని బిఆర్ఎస్ నాయకులను అడిగితే 'మాకు అధికారమే కావాలి' అని నిస్సంకోచంగా అంటారు. అధికారలేమితో ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో కేసీఆర్ కాలుగాలిన పిల్లి వలె తిరుగుతున్నారు.అడపా దడపా కేటీఆర్ విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ పై చెలరేగిపోతున్నారు.కేటీఆర్ అదొక డ్యూటీగా భావిస్తున్నట్లున్నది.

రేవంత్ రెడ్డి 15 నెలల్లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి నానా తంటాలు పడుతున్నారు.పెరుగుతున్న ధరలు,పడిపోతున్న రూపాయి విలువ ప్రభావాన్ని తట్టుకొని జీవించడానికి ఇచ్చే పరిహార భత్యమే ఉద్యోగ,ఉపాధ్యాయ కార్మికుల కరవుభత్యం. జీతం పెంపు కాదన్నది ఉద్యోగుల వాదన.ధరలను అదుపు చేయలేని,రూపాయి విలువ పతనాన్ని ఆపలేని ప్రభుత్వ విధానాలవల్ల పరిస్థితి దిగజారకూడదని ఇస్తున్న పరిహారం ఇది. దేశంలో ఏ రాష్ట్రం లేని విధంగా 5 డీఏలను తెలంగాణ ప్రభుత్వం బకాయి ఉన్నది. ఉద్యోగులు,కార్మికుల సహకారం లేకుండానే ఈ ప్రభుత్వం పనిచేస్తుందా? ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతి, అమలు చేస్తున్న పథకాలు వారి సహకారం లేకుండానే నడిచిపోతున్నాయా? అని ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని ఇదివరకే 'కాగ్' ఆక్షేపించింది.బడ్జెట్ అప్పులు,బడ్జెట్ వెలుపల కార్పొరేషన్లకు గ్యారెంటీ ఇచ్చిన అప్పులు కలిపి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించిపోయాయని వెల్లడించింది గ్యారెంటీ అప్పుల విషయంలో పారదర్శకత లోపించిందని, చివరికి వీటిని ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది.కార్పొరేషన్లకు ఎలాంటి ఆదాయం లేకపోయినా వాటి ద్వారా అప్పులు తీసుకుని,రాష్ట్ర ప్రభుత్వమే వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితిని తప్పుబట్టింది.2019 నవంబరు లోపు ఇలాంటి అప్పుల నుంచి బయటపడాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేసింది. రెవెన్యూ లోటు పెరిగి పోయిందని,కొన్ని ప్రభుత్వ పథకాలకు కేటాయించిన మేర నిధులను ఖర్చు పెట్టలేదని కాగ్ చెప్పింది.వడ్డీల భారం పెరిగిపోయిందని, బడ్జెట్ అంచనాలు,వాస్తవ వ్యయాల మధ్య అంతరం భారీగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. పన్నేతర రాబడులు, సహాయక గ్రాంట్లను అధికంగా అంచనా వేశారని అవేవీ ఖర్చు కాలేదని కాగ్ గుర్తించింది. బడ్జెట్ అంచనాలకు మించి రూ.2,63,092 కోట్లు ఖర్చయినట్లు చెబుతున్నా చేబదుళ్లను పక్కనబెడితే వాస్తవంగా అయిన ఖర్చు రూ.1,95,818 కోట్లేనని తెలిపింది.ఇది బడ్జెట్ అంచనాల్లో 77 శాతమేనని వెల్లడించింది.పింఛన్ల కింద రూ.5046 కోట్లు,దళిత బంధు కింద రూ.3,442 కోట్లు, కుటుంబ పింఛన్ల కింద రూ.1,929 కోట్లు, రాష్ట్ర అభివృద్ధి రుణాల వడ్డీ కింద రూ.1,785 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చేసిన అధిక వ్యయాలుగా కాగ్ తప్పు పట్టింది.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యా, వైద్య రంగాలపై ప్రభుత్వ వ్యయం గత కొన్నేళ్లుగా తక్కువగా ఉంటోందని గుర్తించింది.విపత్తు నివారణ నిధికి ప్రభుత్వం నిధులను జమ చేయడం లేదని కాగ్ ఆక్షేపించింది.

202324 సంవత్సరం నుంచి 203233 నాటికి పదేళ్లలో కాళేశ్వరం అప్పులు రూ,2,31,782 కోట్లను చెల్లించాలని కాగ్ చెప్పింది.ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు మరో రూ.20,266 కోట్లను చెల్లించాలని తెలిపింది.201718లో రూ.10,836 కోట్లుగా ఉన్న వడ్డీ భారం 202122 నాటికి రెట్టింపు అయ్యిందని వెల్లడించింది.కాళేశ్వరం కార్పొరేషన్ అప్పు రూ.72,067 కోట్లు.2022 మార్చి నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు మీద రూ.86,788 కోట్లను వ్యయం చేయగా అందులో కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం సంబంధిత నిధులే రూ.55,808 కోట్లు అని వివరించింది. 202122లో కార్పొరేషన్‌కు అసలు,వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.1,422 కోట్లను రుణ రూపంలో, పెట్టుబడుల రూపంలో మరో రూ.3,072 కోట్లను అందజేసిందని తెలిపింది.10 ఏళ్లలో కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో ప్రభుత్వమే రూ.1,41,544 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. ఇవి కాక నీళ్లు పోయడానికి విద్యుత్తు చార్జీల కింద ఏడాదికి రూ.10,375 కోట్ల చొప్పున 12 ఏళ్లలో రూ.1,24,495 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

**రేవంత్ రెడ్డి 15 నెలల్లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి నానా తంటాలు పడుతున్నారు.పెరుగుతున్న ధరలు,పడిపోతున్న రూపాయి విలువ ప్రభావాన్ని తట్టుకొని జీవించడానికి ఇచ్చే పరిహార భత్యమే ఉద్యోగ,ఉపాధ్యాయ కార్మికుల కరవుభత్యం. జీతం పెంపు కాదన్నది ఉద్యోగుల వాదన.**

తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఏంటి? రాష్ట్రానికి ఉన్న అప్పులెన్ని? కట్టాల్సిన వడ్డీ ఎంత? రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఎంత? ఆ ఆదాయం ఎటుపోతుంది? ఈ ప్రశ్నల చుట్టూ తెలంగాణ రాజకీయం 16 నెలలుగా చర్చ జరుగుతూనే ఉన్నది. తెలంగాణ అప్పులపై రేవంత్ రెడ్డి కొత్త ట్విస్ట్ ఇచ్చారు. పాలనపై వస్తున్న విమర్శలకు చెక్ పెట్టారు. అడ్డగోలు అప్పులు,హద్దులేని వడ్డీలతో ఖజానా ఖాళీ అయిన విషయాన్ని సీఎం ఒక్క దెబ్బతో పటాపంచలు చేశారు.కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అప్పులు,తప్పులను రేవంత్ సూటిగా ప్రజల ముందు పెట్టారు.

కాగా బిఆర్ఎస్ పార్టీతో బీజేపీ గొంతు కలిపింది.''అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్ళాలి'' అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మంగళవారం డిమాండ్ చేశారు.దీన్ని బట్టి బిఆర్ఎస్ ,బీజేపీ ఎంత త్వరగా ఎన్నికలను కోరుకుంటున్నాయో అర్థం చేసుకోవచ్చునని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.''రేవంత్ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ఇతర వర్గాలు కోరుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి డబ్బు సమకూర్చుతాం.అని అంటున్నారు'' అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డి ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు.ఆ వ్యాఖ్యలను ఎల్కతుర్తి రజతోత్సవసభ ప్రసంగంలో కేసీఆర్ కూడా ప్రస్తావించారు.అంటే కేసీఆర్ మదిలోనూ 'మధ్యంతర ఆలోచన' పురుడు పోసుకున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ భారీ విజయం సాధిస్తుంది' అని కేటీఆర్ పదేపదే అంటున్నారు.

''సీఎం రేవంత్‌రెడ్డి ముక్కుసూటి మనిషి.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇది కొంత మందికి ఇబ్బంది కలిగించి ఉండవచ్చేమో కానీ ,వాస్తవ పరిస్థితి అదే. ఒకరిద్దరు ప్రభుత్వాన్ని బెదిరించినట్లుగా వ్యాఖ్యలు చేశారు. ఆ ఆవేదనతోనే సీఎం అలా మాట్లాడారు. ఉద్యోగులందరూ మాకు మిత్రులే.ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అందరూ సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.కాస్త ఆలస్యమైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం. ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఆపే ప్రసక్తే లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజల ముందు పెడితే తప్పేమిటి?. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా మూడో వారంలో జీతాలు ఇచ్చేవారు. డబ్బులు ఇవ్వలేకనే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచింది''అని ముఖ్యమంత్రి రేవంత్ కు మంత్రి శ్రీధర్ బాబు వెన్నుదన్నుగా నిలబడ్డారు.

''తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం సమయంలో 1 లక్షా 16 వేల కోట్ల రెవెన్యూ మిగులు ఉన్నది.దేశంలోనే ఇది ఎక్కువ.14వ ఆర్థిక సంఘం లెక్కలివి.కానీ అతి కొద్ది కాలంలోనే రాష్ట్రంలో రెవెన్యూ లోటు పెరిగింది.అప్పుల కార...

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ఎమోషషన్స్‌ను బ్యాలెన్స్ చేసే యోగాసనం ఏదో తెలుసా?

వశిష్ఠాసనాన్ని సైడ్ ప్లాంక్ పోజ్ అని కూడా అంటారు. ఇది అథ్లెటిక్స్ చేసే వ్యాయామాలను పోలి ఉంటుంది. కాబట్టి శరీరానికి తగినంత చురుకుదనం లభిస్తుంది. శరీర బరువు బ్యాలెన్స్‌ను సరిచూసుకోవడానికి ఈ ఆసనం ఉపయోగ పడుతుంది.

### ఎలా చేయాలంటే...

- మ్యాట్ పైన పడుకొని ఎడమచేతి వైపు తిరగాలి. తర్వాత ఎడమ పాదం నుంచి కుడిమోకాలిని వంచి, ఎడమ చేతిని నేలకు ఆనించి శరీరాన్ని పైకి లేపాలి.
- బరువు మొత్తం చేతి మీద వేయడం సాధ్యం కాని వాళ్లు మోచేతి వరకు ఉంచాలి.
- కుడిచేతిని కుడి తుంటిపై ఉంచాలి. బరువు మొత్తం ఎడమ పాదం, ఎడమ చేతిపైనే ఉంటుంది కాబట్టి
- బాడీని బ్యాలెన్స్ చేయడం తప్పనిసరి. తుంటి భాగాన్ని వీలైనంత పైకి ఎత్తి, కుడిమడమ నుండి తల వరకు శరీరాన్ని ఒక సరళ రేఖలోఉంచేలా దృష్టి పెట్టాలి.
- కనీసం 5 దీర్ఘ శ్వాసలు తీసుకుంటూ, వదిలి ఉండగల గాలి.
- తర్వాత యధాస్థితికి వచ్చి, తిరిగి కుడివైపు ఇదే విధంగా చేయాలి.

### ప్రయోజనాలు...

ఈ ఆసనం ద్వారా శక్తిస్థాయులు పెరుగుతాయి. కండరాలు, వెన్నుముక సమస్యలు తగ్గి బలం పెరుగుతుంది. శరీరానికి, మైండ్‌కి, కండరాలకు సమతుల్యత నిస్తుంది. ఛాతీ, ఊపిరితిత్తులను బలోపేతం చేస్తుంది. ఎమోషన్స్‌ను బ్యాలెన్స్ చేస్తుంది.



# ప్రైవేట్ స్కూల్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

### అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

### మండల విద్యాధికారికి ఫిర్యాదు


### టిఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

మండలంలో ప్రైవేట్ స్కూల్ లలో ఫీజుల దోపిడీని అరికట్టి, అనుమతిలేని స్కూల్లపై చర్యలు తీసుకోవాలిటిఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ అన్నారు. తలకొండపల్లి మండలంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, బట్టలు, పెన్నులను విద్యా సంవత్సరం ప్రారంభమౌతున్న సమయంలో విచ్చలవిడిగా దందాను కొనసాగిస్తారు. వాటిపై చర్యలు తీసుకునే విధంగా, దానిపైన వెంటనే టాక్స్ ఫోర్స్ వేసి ప్రవేట్ స్కూల్ లను తనిఖీ చేసి వాటిపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి ఎంఈఓ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. పేద మధ్య తరగతి ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయలు ఫీజులను దోచుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించడం




జరిగింది. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల కమిటీ సభ్యులు తుమ్మ నితీష్ వర్మ, శ్రీకాంత్, ఎస్ సి ఆర్ పి ఎఫ్ సోషల్ మీడియా ఇన్చార్జ్ వాటం శ్రీశైలం, టి ఎస్ ఎస్ ఓ కమిటీ సభ్యులు శ్రీకాంత్, సందీప్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.






# కళ్యాణ వేడుకల్లో కంది శ్రీనివాస రెడ్డి

### అభిమానంతో ఆహ్వానించిన వారి వివాహాలకు హాజరు.. నూతన జంటలను దీవించి పెళ్లికానుకలు బహుకరణ

**ఆదిలాబాద్ మహా :**

పెళ్లిళ్ల సీజన్ లో కళ్యాణ వేదికలన్నీ కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పై అభిమానంతో తనను ఆహ్వానించిన వారి వివాహాది శుభకార్యాలకు ఆయన తన శ్రేణులతో కలిసి హాజరయ్యారు. కళ్యాణ మండపాలలో మిత్రులు, శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని పలు పంక్షన్ హాళ్ల లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులు ఆశీర్వదించి కంది శ్రీనన్న పెళ్లి కానుకలను బహుకరించారు. ఆయన వెంటకాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,మునిగేల విట్టల్,మొహమ్మద్ రఫీక్,తాజా మాజీ కౌన్సిలర్ సంద నర్సింగ్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, నాయకులు పోరెడ్డి కిషన్,తమ్మల చందు,బండి నరసింహ చారి,ముక్కెర సంతోష్ తదితరులు హాజరయ్యారు.



# ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ గా క్యామ రాజేష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ గా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ పట్టణానికి చెందిన క్యామ రాజేష్ నియామకం అయ్యారు. గాంధీభవన్ లో జరిగిన సమావేశంలో ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి మరియు జిల్లా ఇంచార్జులు రామ్ రెడ్డి, అరవింద్ గార్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ గా నియమితులైన క్యామ రాజేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ గా నియామకానికి ప్రోత్సహించి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు మరియు యూత్ కాంగ్రెస్ పార్టీ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకుల సహకారంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. అన్ని వర్గాల యువత యొక్క సమస్యలను పరిష్కారిస్తు వారిని



ఏఐసిసి నాయకులు లోకసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారి మరియు కాంగ్రెస్ ఆలోచనల వైపు మళ్లించేందుకు పనిచేస్తానని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళి అర్హులైన లబ్దిదారులందరికీ ఆరు గ్యారంటీల పథకాలు అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో యువతకు గొప్ప భవిష్యత్ ఉందని, కాంగ్రెస్ పార్టీనే దేశ రాష్ట్రాల భవిష్యత్తుకు మార్గదర్శకమని క్యామ రాజేష్ ధీమా వ్యక్తం చేశారు.

# ఎడిటర్ ఇంటిపై దాడిని ఖండించిన జర్నలిస్టులు

**ఆదిలాబాద్ మహా :** ఏపీ పోలీసులు పత్రికా స్వేచ్చను కాలరాస్తు పాత్రికేయుల ఇళ్లపై దాడులకు దిగడాన్ని ఆదిలాబాద్ జర్నలిస్టులు ఖండించారు. శుక్రవారం పట్టణం లో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రెస్ క్లబ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏపీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదించారు. విజయవాడలో ఓ ప్రముఖ దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి నివాసంలో ముందస్తు అనుమతులు లేకుండా తనిఖీల పేరుతో కుటుంబసభ్యులను భయ భ్రాంతులకు గురి చేసారని జర్నలిస్టులు సురేష్, కృష్ణకాంత్ గౌడ్ , ఫిరోజ్ ఖాన్ ఏపీ పోలీసుల తీరును తప్పుబట్టారు. పత్రికా స్వేచ్చకు భంగం కలిగే విధంగా ఏపీ కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఎడిటర్ పై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేయడం సరి కాదన్నారు. ధనుంజయ్ రెడ్డి పై పెట్టిన కేసులను వెంటనే విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు సారంగ పాణి, సత్యనారాయణ , శ్రీనివాస్ ,సుధాకర్, వెంకటేష్, అస్మత్, రవి, ప్రవీణ్, సుభాష్, శ్రీకాంత్, నీలేష్ , రాజు , అభిలాష్, అరుణ్ రెడ్డి, వినోద్, నరేష్, సందేశ్,సంతోష్, రాజేశ్వర్, పవన్,శ్రీనివాస్, దత్తు,దీపక్, మహేందర్, విజయ్ రెడ్డి, ప్రవీణ్, రాకేష్, నర్సింగ్, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పథకాల పరిశీలనలో వేగం పెంచండి

### బల్దియా కమీషనర్ డా అశ్విని తానాజీ వాకడే

### రేషన్ కార్డ్ ల సర్వే ఇందిరమ్మ ఇళ్లు రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల పురోగతిపై సమీక్ష

**వరంగల్ మహా;** ప్రభుత్వ పథకాల పరిశీలనలో వేగం పెంచాలని బల్దియా కమీషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ కమిషనర్ లతో రేషన్ కార్డ్ విచారణల ఇందిరమ్మ ఇళ్లు రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించి సమర్ధవంతం నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో భాగంగా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేసి ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ల లాగిన్ లోకి పంపించాలని కొత్త గా దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డుల సర్వే



మొదలు పెట్టాలని రాజీవ్ యువ వికాసం కు వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి సిబిల్ స్కోర్ కోసం బ్యాంకులకు పంపించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, రాజేశ్వర్, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య... బంగారు భవిష్యత్తు

### బడిబాటలో ఇంటింటికి తిరిగిన ఉపాధ్యాయులు

### మీ పిల్లలును మా బడిలో చేర్పించండి.. సానుకూలంగా స్పందించిన తల్లిదండ్రులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య... బంగారు భవిష్యత్తు ఉంటుందని, బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను కలిసిన ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పాఠశాల విద్యాశాఖ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నం ప్రధానోపాధ్యాయులు వెంకట రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు పొగాకు సురేష్ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలు, జంగాల బస్తి ప్రాంతాల్లోని చాలా ఇళ్లను సందర్శించి, విద్యార్థుల తల్లిదండ్రులను కలవడం జరిగింది. పాఠశాలలో ఉన్నటువంటి మౌలిక వసతులను గురించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాఠశాలలో ప్రారంభిస్తున్న విషయం గురించి పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయుల యొక్క అర్హతల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. వారి పిల్లల బంగారు భవిష్యత్తుకై పాఠశాలలో చేర్పించాల్సిందిగా కోరడం జరిగింది. చాలామంది తల్లిదండ్రులు పాఠశాలలో విద్యనందిస్తున్న తీరుపట్ల పాఠశాల పట్ల సానుకూలంగా స్పందించి, తమ పిల్లల్ని పాఠశాలలో చేర్పించడానికి సుముఖత వ్యక్తం చేశారని వారు తెలిపారు. ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 90% ఉత్తీర్ణత రావడం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షల్లో పాఠశాల నుండి 11మంది



విద్యార్థులు ఎంపిక కావడం, ఎటిఎం ల్యాబ్ లో గ్రాండ్ మాస్టర్ ఛాలెంజ్ అవార్డు గెలుచుకోవడం, విద్యార్థులు ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం లాంటి ఎన్నో అంశాల్ని తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి ఎన్నో సౌకర్యాల అందించడంతో పాటు, నాణ్యమైన రెండు జతల ఎకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం గురించి వారు వివరించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న సువిశాలమైన తరగతుల గదుల గురించి, అన్ని రకాల కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ యొక్క సౌకర్యాలు గురించి క్షుణ్ణంగా తల్లిదండ్రులకు వివరించగా వారు సంతృప్తి వ్యక్తం చేసి ఈ సంవత్సరం విద్యార్థులని అధిక సంఖ్యలో చేర్పించడానికి సంసిద్ధత వ్యక్తించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు వెంకట రెడ్డి తెలిపారు.

# మురళి నాయక్ సచిన్ యాదవ్ జవాన్లకు అశ్రు నివాళి

### పాకిస్తాన్ కవ్వింపు చర్యలు మానుకోవాలి

### భారత దేశం తలుచుకుంటే పాకిస్తాన్ ప్రపంచ పఠంలో లేకుండా పోతుంది

### టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పాకిస్తాన్ కవ్వింపు చర్యలు మానుకోకపోతే భారత దేశం నుండి కోలుకోలేని దెబ్బ తప్పదని ప్రపంచ పఠంలో పాకిస్తాన్ అనే దేశం లేకుండా పోతుందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆమనగల్ మండలం, మైసిగండి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కేతావత్ హీరా సింగ్ నాయక్ ఆధ్వర్యంలో భారత్ పాకిస్తాన్ యుద్ధంలో జవాన్లు అసువులు బాసి వీర మరణం పొందడం బాధాకరం అని, ఈ దేశం కోసం ఈ దేశ ప్రజల కోసం సరిహద్దుల్లో ఉంటూ, మన అందరి రక్షణ కోసం పాకిస్తాన్ సైనికులతో, ఉగ్రవాదులతో పోరాడుతూ తమ ప్రాణాలు వదిలిన అమర వీరులు జవాన్లకుమురళి నాయక్ సచిన్ యాదవ్ జవాన్లకు అశ్రు నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించడం జరిగింది. సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న జవాన్లకు మద్దతుగా పాకిస్తాన్ కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం వీర జవాన్ల చిత్రపటాలకు నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... నిత్యం శాంతి కోరే భారతదేశం పై పాకిస్తాన్ ఎప్పుడు కవ్వింపు చర్యలు పాల్పడుతూ ఉగ్రవాదాన్ని పోషిస్తూ, ప్రజల పైన దేశం పైన దాడులు చేస్తూనే ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశమంతా ఏకమై సైనికులకు, భారత ప్రభుత్వానికి అండగా నిలిచిందన్నారు. ప్రపంచ దేశాలు సైతం పాకిస్తాన్ ఆగడాలను, కవింపు చర్యలను ఎండగడుతూ భారతదేశానికి మద్దతు ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. పాకిస్తాన్ ఇలానే వ్యవహరిస్తే ప్రపంచ పటంలో పాకిస్తాన్ అనే దేశం లేకుండా పోతుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. దేశ ప్రజలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు భారత ప్రభుత్వానికి సైనిక మిలిటరీకి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ దేశ భద్రత కోసం ఏ సమయానైనా మద్దతుగా నిలబడడానికి ప్రతి వ్యక్తి సంసిద్ధంగా ఉన్నారన్నారు. అరగంటలోనే ఇద్దరు మహిళలు కల్నాల్ సోఫీయా ఖురేసి, వింగ్ కామండర్ వ్యోమిక సింగ్, పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి, ఉగ్రవాద శిబిరాలను నెలామట్టం చేసి వంద మందికి పైగా ఉగ్రవాదులను హతం చేసి, వందల మందిని క్షతగాత్రులను చేసిన విషయం మరిచి పాకిస్తాన్ కయ్యానికి రావడం సిగ్గుచేటు అని అన్నారు. చైనా నుంచి తెచ్చుకున్న JF 17 ను భరత్ ప్రయోగిస్తే, దానికి భరత్ దీటుగా SD 400 డిఫెన్స్ సిస్టమ్ తో ఆకాశంలోనే ధ్వంసం చేసిన విషయాన్నీ మరవద్దు అని అన్నారు.



# జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన

**హన్మకొండ, మహా;** హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధి గుండా వెళ్తున్న 163జి గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో జాతీయ రహదారి 163జి, కాలా ప్రాజెక్ట్ పనుల పురోగతి పై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, సీజీఎం ఆర్వో శివశంకర్, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యా రాణి లతో కలిసి జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి హరిచందన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ లో మంచిర్యాల నుండి భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల మీదుగా ఖమ్మం నుండి విజయవాడ వరకూ (నాగపూర్ విజయవాడ) నిర్మించే 163జి గ్రీన్ ఫీల్డ్ ఎకానమిక్ కారిడార్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ రెండో దశ ప్రాజెక్ట్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన



భూసేకరణ ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సరస్వతి పుష్కరాల తరువాత భూసేకరణ పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. భూసేకరణ పెండింగ్ లో ఉన్న ప్రాంతాల రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించి పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణలో భాగంగా రైతులతో అధికారులు మాట్లాడి పరిహారం చెల్లించారు. అదేవిధంగా మామూనూర్ ఎయిర్ పోర్ట్ కనెక్టివిటి రోడ్లకు సంబంధించిన భూసేకరణపై ఆర్ అండ్ బీ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల శాఖ వరంగల్, ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, దివ్య, ఆర్ అండ్ బీ ఎస్ ఈ నాగేంద్ర రావు, ఈఈ సురేష్ బాబు, ఆర్డీవోలు ఎన్. రవి, ఉమారాణి, సత్య పాల్ రెడ్డి రాథోడ్ రమేష్, నారాయణ, తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హిట్లర్ ఫాసిజం సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించింది ఎర్రజెండా

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- జర్మనీలోని బెర్లిన్ నగరానికి హిట్లర్‌ను తరిమికొట్టింది
- సోవియట్ యూనియన్ స్ఫూర్తితో ఉద్యమాలు
- ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెకు
- 30న వ్యకాస ధర్నాలకు సీపీఐ(ఎం) మద్దతు
- భారత్, పాకిస్తాన్ యుద్ధ సమయంలో హైదరాబాదులో అందాల పోటీలా?
- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి
- ఉగ్రవాద చర్యలను అడ్డుకోవాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** హిట్లర్ పాసింజం, సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించి రష్యాలో ఎర్రజెండా ఎగిరేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ప్రపంచ దేశాలను ఆక్రమించుకోవాలన్నా కుట్రగా జరిగిన హిట్లర్ దూకుడుకు ఎర్రజెండా అడ్డుకట్ట వేసిందన్నారు. రష్యాలో అడుగు పెట్టకుండా సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం అడ్డుకొని కమ్యూనిస్టు నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చాయని గుర్తు చేశారు. హిట్లర్ పాసింజంపై




నాటి సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించి 80 సంaవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. నియంత హిట్లర్ ప్రపంచంలోనే ఒక్కొక్క దేశాన్ని ఆక్రమించుకుంటూ రష్యాను కూడా ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని 1945లో సోవియట్ యూనియన్, కమ్యూనిస్టు పార్టీల ఎర్రసైన్యం అడ్డుకట్ట వేశాయన్నారు. హిట్లర్ ను ఓడిరచిందన్నారు. ఈ తరుణంలో ఫాసిజం, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, ప్రజలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు, పాలకవర్గాలు హిట్లర్ నాజీయిజాన్ని పెంచి పోషించాయని తెలిపారు. కమ్యూనిజాన్ని లేకుండా చేస్తాడని ఆయనను ప్రోత్సహించి రష్యా, సోవియట్ యూనియన్ మీద దాడి చేయించడానికి పూనుకున్నాయన్నారు. హిట్లర్ పాసిజానికి వ్యతిరేకంగా రష్యాలో స్టాలిన్ నాయకత్వాన 2 కోట్ల మంది సోవియట్ యూనియన్ ప్రజలు, సైన్యం తిరుగుబాటు చేసి ప్రాణాలర్పించారన్నారు. ఈ పోరాటంలో 30 లక్షల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలు బలి ఇచ్చారన్నారు. 20 లక్షల మంది యూదులను ఊచకోత కోశారని తెలిపారు. అయినా రష్యా ప్రజలు పోరాట శక్తిని ప్రదర్శిస్తూ హిట్లర్ ఫాసిజాన్ని ఓడించి జర్మనీలోని బెర్లిన్ నగరానికి హిట్లర్‌ను తరిమికొట్టి అక్కడ ఎర్రజెండా ఎగురవేశారని వివరించారు. ప్రపంచంలోని సంపద, వనరులను కాజేయాలన్న హిట్లర్ కుట్రలను రష్యా ప్రజలకు అడ్డుకట్ట వేశారన్నారు. ఎర్రజెండాను కనుమరుగు చేయాలనుకోవడం పాలకపక్షాలు, నియంతృత్వ శక్తులతరం కాదన్నారు. ఈ తరుణంలో 8 గంటల పని విధానం కోసం ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు కొట్లాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. మళ్ళీ 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. సంఘాలు, సమ్మె హక్కులు లేకుండా చేస్తున్నారన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని ఉద్యమాలు కొనసాగుతుంటే పని గంటలు తగ్గించడం మోడీ ప్రభుత్వ నియంతృత విధానాలకు నిదర్శనన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, విద్యా, వైద్యం అందడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు కావడం లేదన్నారు. ప్రపంచాన్నే గడగడలాడించిన హిట్లర్నే ఓడించిన శ్రామిక వర్గం, ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత విధానాలను సైతం ఓడిస్తారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు.

**అందాల పోటీలు అవసరమా..**

ఓవైపు భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా హైదరాబాదులో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని జాన్ వెస్లీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను దేశ ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి కల్పించొద్దని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే హైదరాబాద్ లో జరగాల్సిన అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# జిల్లా విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేయాలి

### మంద శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కేంద్రంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ పేద విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న హన్మకొండ జిల్లా విద్యాశాఖ అధికారులు డీఈవో, డిఐఈఓ లను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ హన్మకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోనీ గెస్ట్ హౌస్ లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హన్మకొండ నగరంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించకుండా ప్రైవేట్ కార్పొరేటు స్కూల్స్ ప్రైవేటు కార్పొరేటు జూనియర్ కళాశాలలు నగరంలో పెద్దపెద్ద హోర్డింగ్లు ఏర్పాటు చేస్తూ జోరుగా ప్రచారం నిర్వహిస్తూ విచ్చలవిడిగా సమ్మర్ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ వారి దగ్గర నుంచి వేల రూపాయల నుండి లక్షల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై స్థానిక విద్య శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించడం లేదని కనీసం అధికారులు అందుబాటులో ఉండడం లేరని కనీసం ఫోన్లోనైనా సమస్యలను చెబుదామంటే కూడా ఫోన్ చేస్తే కూడా స్పందించడం లేదన్నారు. హనుమకొండ నగరంలో కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు



ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకున్నా కూడా స్కూల్స్ ను ప్రారంభం చేసి అక్రమంగా అడ్మిషన్లు చేర్చుకుంటున్నారు. అలాగే హనుమకొండ నగరంలో ఐఐటి అకాడమీల పేరుతో సంస్థలను నిర్వహిస్తూ ఎలాంటి అనుమతులు లేకున్నా కూడా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా అందులోనే జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసుకొని విద్యార్థులను చేర్చుకుంటూ అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ వారి సంస్థలను నడిపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని మేము అడుగుతున్నామన్నారు వెంటనే ఈ విషయంపై స్థానిక జిల్లా కలెక్టర్ స్పందించి అధికారులను సస్పెండ్ చేసి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న ప్రైవేట్ కార్పొరేటు విద్య సంస్థలను మూసివేసి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# యుద్ధ వాతావరణంలో అందాల పోటీలా?

## మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి

ఈ పోటీలను కూడా ఐపీఎల్‌లాగా పోస్ట్‌పోన్ చేయాలి

మన సీఎం: ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు

హామీలు నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలి

సంఘీభావ ర్యాలీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణలో నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్‌ను వాయిదా వేసినట్లుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని సూచించారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొంటే దేశంలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందని అన్నారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావునివ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరిగిన భారీ ర్యాలీకి కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పదవి నుంచి తప్పుకోవాలె..**

అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను దిగ్విజయంగా భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం, స్థైర్యాన్ని నింపడానికి ర్యాలీ చేశామని చెప్పారు. మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని పాకిస్తాన్ చేసిన దాడులను భారత సైన్యం గట్టిగా తిప్పి కొట్టిందని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన, ప్రజలైనా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని, కానీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా సీఎం మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కవిత వ్యాఖ్యానించారు.



# రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి భూ సమస్యలు పరిష్కరించు కోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను , రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌లను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుని ఎంపికకు క్షేత్ర స్థాయిలో స్థితిగతులను పరిశీలించి నిబంధనల మేరకు అత్యంత నిరుపేదను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్ సాగర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల కుటుంబాలకు ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

## కరీంనగర్ జిల్లా శాఖ కృతజ్ఞతలు

**కరీంనగర్, మహా:** విధి నిర్వహానలో మరణించిన, అనారోగ్యాల గురైన జర్నలిస్టుల కుటుంబాలకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన చనిపోయిన జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్ ద్వారా జర్నలిస్టుల కుటుంబాలకు 1లక్ష ఆర్థిక సహాయం 5సంవత్సరాలు నెలకు 3వేలు పెన్షన్ 10వ తరగతి లోపు చదివే పిల్లలకు ఉంటే ఒక్కొక్క వెయ్యి చొప్పున శాశ్వత అంగవైకల్యం పొందిన జర్నలిస్టులకు 1లక్ష చొప్పున అందిచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యి మాట్లాడుతూ జర్నలిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటుందని త్వరలో అక్రిడిటేషన్ కార్డుల తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకి జిల్లా కలెక్టర్ లకు అదేశాలు జారీ చేస్తామన్నారు కరీంనగర్ జిల్లాలో మృతి చెందిన నలుగురికి జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యాల గురైన నలుగురు జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల మరణించిన పత్తి విష్ణువర్ధన్ రెడ్డి, అన్నేపాక సురేందర్, బాణాల శ్యాంసుందర్, ముజాహిద్ ఖాన్ కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. శాశ్వత అంగవైకల్యం పొందిన జి ఉదయకుమార్, పత్తి కొండారెడ్డి,ఉమ్మడి రాజేష్, జడల చిరంజీవి లకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) కరీంనగర్ జిల్లా శాఖ అండగా నిలిచింది. తెలంగాణ మీడియా అకాడమీ నుండి అందించే ఆర్థిక సహాయానికి బాధిత కుటుంబాల చేత టీయూడబ్ల్యూజే దరఖాస్తులు సమర్పించింది.



# మురళి నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది

లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ నాయక్

షాద్ నగర్ లో మురళి నాయక్ ఆత్మశాంతికి క్యాండిల్ ర్యాలీ

మురళి నాయక్ అమర్ రహే అంటూ గిరిజన నాయకుల శ్రద్ధాంజలి

**షాద్ నగర్, మహా:** పాకిస్తాన్‌తో పోరాటంలో జవాన్ మురళి నాయక్ మృతి పట్ల లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవ రాంబల్ నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గిరిజన నాయకులు పలువురు క్యాండిల్ ర్యాలీ ఏర్పాటు చేశారు. మురళి నాయక్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినదించారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మురళి నాయక్ కుటుంబానికి కోట్లాదిమంది భారతీయులు అండగా నిలుస్తారని అన్నారు. ఈ సందర్భంగా మురళి నాయక్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి రాంబాల్ నాయక్ మాట్లాడుతూ.. మురళి నాయక్ వీరమరణాన్ని యావత్ భారతదేశం గుర్తుంచుకుంటుందని తెలిపారు. దేశం కోసం మురళీనాయక్ చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. మురళి నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. వారి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు. కాగా.. భారతదేశం పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలుగు గిరిజన బిడ్డ జవన్ మురళి నాయక్ అమరడు కావడం పట్ల అతని త్యాగాలను ఈ దేశంలోని గిరిజన జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన మురళి నాయక్ గత కొన్నేళ్లుగా భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నారనీ (గురువారం) రాత్రి యుద్ధభూమిలో జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందారన్నారు. ఈ విషయం తెలుసుకున్న జవన్ కుటుంబ సభ్యులు తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారనీ అయితే రేపు (శనివారం) జవన్ మురళి నాయక్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. ఇప్పటికే మురళి నాయక్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు బండి సంజయ్ కిషన్ రెడ్డి ఇంకా పలువురు నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారన్నారు. మురళి నాయక్ కుటుంబానికి గిరిజన జాతి మొత్తం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.




# ఉడ్ ల్యాండ్ నూతన షోరూమ్ ను ప్రారంభించిన తుఫాన్ హెచ్చరిక మూవీ టీం

## కస్టమర్లను నమ్మకానికి పెద్ద పీట వేస్తామన్నా ఉడ్ ల్యాండ్ సౌత్ జోన్ ఇంచార్జ్ లీలా ప్రసాద్




**బాలాపూర్ మహా:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఉడ్ ల్యాండ్ 27వ నూతన షోరూమ్ ను కొత్తపేట లో ప్రారంభించిన తుఫాన్ హెచ్చరిక మూవీ టీం. నాణ్యత లో రాజీ పడకుండా కస్టమర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బ్రాండ్ ఇమేజ్ తో ఉడ్ ల్యాండ్ నిలబడుతుందని తుఫాన్ హెచ్చరిక మూవీ టీం పేర్కొంది. ఉడ్ ల్యాండ్ కంపెనీకి సంబంధించి వస్తువులను గత పది సంవత్సరాలు నుండి ఉపయోగిస్తున్నానని సినీ హీరో రాఖీ తెలిపారు. క్వాలిటీ పరంగా కంపెనీ ఉడ్ ల్యాండ్ చాలా బాగుంటాయని అన్నారు. సెలెక్ట్ చేసిన వస్తువు పై డిస్కౌంట్ లభిస్తుందని ఉడ్ ల్యాండ్ సౌత్ జోన్ ఇంచార్జ్ లీలా ప్రసాద్ తెలిపారు. కస్టమర్ లకు మా పై చూపెడుతున్న ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉంటామని లీలా ప్రసాద్ తెలిపారు. వైవిధ్యభరితమైన మెన్స్,ఉమెన్స కలెక్షన్ల తో ఉడ్ ల్యాండ్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఫ్యామిలీకి సంబంధించిన అన్ని రకాల వస్తువులు ఇక్కడ లభ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుఫాన్ హెచ్చరిక మూవీ హీరో రాఖి,హీరోయిన్స్ సుహాన, రేణు, డైరెక్టర్ జగదీష్,ప్రొడ్యూసర్ శ్రీనివాస్,రజినీ కాంత్,ఉడ్ ల్యాండ్ షో రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వాహనాలు వద్దు ఆర్టీసీ ముద్దు

## ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం - సుఖవంతం

**కోరుట్ల, మహా:** కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ... మన కోరుట్ల డిపో నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కి రెండు రాజధాని AC బస్సులు ఉండేవి.ఆ తర్వాత క్రమంగా ప్రయాణికుల యొక్క మంచి ఆదరణతో కోరుట్ల డిపో నుండి శంషాబాద్ ఎయిర్పోర్ట్ కి ప్రతిరోజు 4 బస్సులు (2 AC 2 NON AC) నడుస్తున్నాయి. అలాగే కోరుట్ల నుండి కనిగిరి పామూరు మరియు కనిగిరి వింజమూర్ కి కూడా రెండు బస్సులతో మొదలయి ప్రయాణికుల మంచి ఆదరణతో 4 (NON AC) బస్సులు నడుస్తున్నాయి. కానీ ఈ మధ్యకాలంలో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా మరియు వాట్సప్ గ్రూపులలో ఈ రోజు లేదా రేపు కోరుట్ల నుండి శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు మరియు శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుండి కోరుట్ల కి ఈ సమయానికి వెహికల్ ఖాళీగా వెళుతుంది వెళ్లేవారు ఉంటే కాల్ చేయండి అని మెసేజ్ లు వస్తున్నాయి. అలాగే కనిగిరి పామూరు ఆంధ్ర సర్వీసులకు కూడా ప్రైవేట్ ట్రావెల్స్ నడుస్తున్నవి.కావున మెసేజ్ లను చూసి కాల్ చేసి ఆ వెహికల్ లో వెళ్ళిపోతున్నారు. అలాగే ట్రావెల్స్ లను బుకింగ్ చేసుకుని వెళ్ళిపోతున్నారు. దీనివలన కోరుట్ల నుండి ఎయిర్ పోర్ట్ కి వెళ్లే వారి సంఖ్య అలాగే కనిగిరి పామూరు మరియు వింజమూరు వెళ్లే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయి బస్సులు తగ్గిపోయే అవకాశం ఉంది. కావున ప్రజలందరూ కూడా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేసి సురక్షితమైన సుఖవంతమైన ప్రయాణాన్ని పొంది ఇంకా కొంచెం మంచిగా ఆదరిస్తే మరిన్ని బస్సులు పెరిగే అవకాశం కలదు. కావున ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ప్రతి ఒక్కరు ఆర్టీసీని ఆప్యాయతతో, ప్రేమతో ఆదరించగలరని ఒక ప్రకటనలో తెలపడం జరిగింది



# రైతు ముంగిట్లో శాస్త్రవేతలు

## ఉద్యానవన పంటలతో అధిక దిగుబడి: డిఎఓ. నరసింహారావు

**రాజేంద్రనగర్, మహా ,** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. రైతు ముంగిట్లో అన్నదాతల అవగాహనా కార్యక్రమం శంషాబాద్ మండలం జూకల్ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

**డి ఎ ఓ నరసింహారావు మాట్లాడుతూ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా రూపొందించిన రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం అన్నదాతలకు ఎంతో మేలు కలిగించే కార్యక్రమం అన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించే పంటలను ఎన్నుకోవాలి. సేంద్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయం లాభదాయకమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నలు చేసే కష్టం అవగాహనతో కూడినది అయితే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. మన ముంగిటికే శాస్త్రవేత్తలు వచ్చి పంటలు ఎలా పండించాలి, అధిక దిగుబడి ఎలా తీసుకురావాలి అనే అవగాహన కల్పించడం ఎంతో సంతోషం అన్నారు రైతులు నిరంతరం శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు పాటిస్తూ మేలు రకమైన పంటలు పండిస్తూ అధిక దిగుబడికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో పాకిస్తాన్ ప్రాంతంలో ఉగ్రదాడుల క్యాంపులను నామరూపాలు లేకుండా చేయాలన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు పూర్తి మద్దతు తెలిపారు. భారత దేశ ఆర్మీ అధికారులు సరైన రీతిలో పాకిస్తానుకు జవాబిస్తున్నారు. అమాయకులైన బెల్గాం యాత్రికులను పొట్టన పెట్టుకున్న తీవ్రవాదులను అంతమొందించాలన్నారు. మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేశారు.



# కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం

ఏటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె .. వాల్ పోస్టర్ విడుదల

**రాజేంద్రనగర్, మహా :** కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తో కలిసి పాలమాకుల జంగయ్య శంషాబాద్ లో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు కొత్త కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న ఈ పోరాటంలో భాగంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అయిన పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చందు యాదవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే నర్సింహారెడ్డి, వడ్ల సత్యనారాయణ, ఎస్ మల్లేష్, రమావత్, సక్రూ నాయక్, నర్రగిరి, బాబురావు, రాజు, నారాయణ, మహదేవ్ శివ పాల్గొన్నారు.

# లిక్కర్ స్కామ్ లో ఏపీ పోలీసులు కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు

**రాజేంద్రనగర్, మహా:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించి రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్ పల్లి సన్ రైస్ విల్లాస్ లో ఏపీ పోలీసుల సోదాలు శుక్రవారం నిర్మించారు. పల్లెకూరి కృష్ణమోహన్ రెడ్డి, రోహిత్ రెడ్డికి సంబంధించిన విల్లా నంబర్ 9ఏ లో సోదాలు నిర్వహించిన ఏపీ పోలీసులు. పల్లెకూరి కృష్ణ మోహన్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు రోహిత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు నోటీసులు అందజేశారు. ఈనెల 11వ తేదీన విజయవాడలోని సిట్ కార్యాలయంలో హాజరుకావాలని పోలీసులు సూచించారు.



# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ మైనారిటీ గురుకులాలు

## ఆర్ ఎల్ సి కనపర్తి సురేష్ కుమార్

**కరీంనగర్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ గుకులల్లో కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని మైనారిటీ గురుకుల ఆర్ ఎల్ సి కనపర్తి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అస్లాం మజీద్ దగ్గర మైనారిటీ గురుకుల పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయ బృందం తో కలిసి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం లో అల్ప సంఖ్యాకులు అందరితో సమానంగా ఎదగడానికి గురుకులాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. కరీంనగర్ బాయ్స్ 2 ఇరుకుల్ల పాఠశాల యందు 5,6,7,8,9వ తరగతులలో మరియు ఇంటర్మీడియట్ MEC మరియు CEC కోర్సులలో ముస్లిం మైనారిటీ విద్యార్థులకు అవకాశం కలదు అని తెలియజేస్తూ, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్ లతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తుండటం జరుగుతుందని అన్నారు. ఉన్నత అర్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో గురుకుల పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, ఇక్కడ ఉపాధ్యాయుల సామర్థ్యానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు ముక్యంగా మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురుంచి వివరించడానికి వస్తువుల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం నుండి ఐఐటీ మరియు నీట్ ఫౌండేషన్ 8 వ తరగతి నుండి ప్ర రంబించున్నమన్నారు. ఈ కార్యక్రమం లో స్కూల్ కో ఆర్డినేటర్ మహేందర్, కాలేజ్ కో ఆర్డినేటర్ రాజు, నగేష్,అధ్యాపకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# సాంకేతికతపై రైతులకు అవగాహన సదస్సులు

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రాములు నాయక్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా పోలికపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. శంకర్ పల్లి మండలం, పోలికపల్లి గ్రామంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ఎం విద్యాదరి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి అగ్రికల్చర్ కమిషన్ మరియు వెల్ఫేర్ మెంబర్ సభావత్ రాములు నాయక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ... రైతులు వ్యవసాయంలో పాటించవలసిన సాంకేతికపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి శాస్త్రవేత్తలు వచ్చి అవగాహన కల్పిస్తారని, వారు చెప్పే సూచనల ప్రకారం నాణ్యమైన విత్తనాలను వేసుకొని, ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి అధిక దిగుబడితో రైతు లాభాలను పొందాలని, లాభదాయకమైన పంటలను వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సృజన, వై శ్రావణ్, పంచాయతీ సెక్రెటరీ రాధా, Dr వి సునీత, Dr ఎస్ శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు అండగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం

**వరంగల్ మహా;** ఇటీవల రాష్ట్రంలో అకాల మరణానికి గురైన 38 మంది జర్నలిస్టులతో పాటు ప్రమాదాలకు, అనారోగ్యలకు గురై మంచం పట్టిన 8మంది జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) అండగా నిలిచింది. తెలంగాణ మీడియా అకాడమీ నుండి అందించే ఆర్థిక సహాయానికి బాధిత కుటుంబాల చేత టీయూడబ్ల్యూజే దరఖాస్తులు సమర్పించింది. హైదరాబాదులో శుక్రవారం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిల చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు.



ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణలతో పాటు ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంఏ మాజీద్, రాష్ట్ర కార్యదర్శులు కే.శ్రీకాంత్ రెడ్డి, జి.మధుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, గౌస్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, హెచ్.యూ.జే అధ్యక్షులు శంకర్ గౌడ్, లు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై టెన్షన్.. ఆయిల్ కంపెనీ క్లారిటీ




భారత్‌పాకిస్థాన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత వస్తుందేమోనన్న ఆందోళనతో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలను ముందే కొని నిల్వ చేసుకునేందుకు దేశంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద జనం క్యూ కడుతున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) స్పష్టత ఇచ్చింది. దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఈ మేరకు ఐఓసీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'(ట్విటర్)లో ఒక పోస్ట్ చేసింది. "భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో సమృద్ధిగా అందుబాటులో ఉంది" అని తెలిపింది. దేశవ్యాప్తంగా ఇండియన్ ఆయిల్ వద్ద ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, తమ సరఫరా మార్గాలు సజావుగా పనిచేస్తున్నాయని తెలిపింది. వినియోగదారులు అనవసర ఆందోళనతో పెట్రోల్ బంక్‌లకు పోటెత్తవద్దని సూచించింది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి, ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన దాడుల తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో ఈ భయాందోళనలు నెలకొన్నాయి.




# సరిహద్దు రాష్ట్రాల్లోనే భారీగా బ్యాంకు డిపాజిట్లు..

భారత్‌పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ పరిస్థితులు ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్నాయి. పాకిస్తాన్‌పై ఓవైపు మెరుపుదాడులతో విరుచుకుపడుతూనే మరోవైపు సరిహద్దు వెంబడి ఆ దేశం చేస్తున్న దాడులను భారత్ సైనిక దళాలు తిప్పికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో ప్రభుత్వం హై అలర్ట్ కొనసాగుతోంది. అయితే ఈ సరిహద్దు రాష్ట్రాల్లోనే గణనీయమైన డిపాజిటర్ బేస్ ఉండటంతో బ్యాంకింగ్ రంగం ఇక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తుంది. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా గణాంకాల ప్రకారం.. భారతదేశ మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 12.81 శాతం అంటే రూ .26.21 లక్షల కోట్లు ఆ అయిదు రాష్ట్రాల నుంచే ఉన్నాయి. ఇక అప్పుల విషయానికి వస్తే మొత్తం అడ్వాన్సులలో 13.41 శాతం అంటే రూ .22.13 లక్షల కోట్లు ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయి.

**జమ్ముకశ్మీర్‌లో..**

ఘర్షణకు కేంద్ర బిందువైన కేంద్రపాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ అస్థిర నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)తో సహా పాకిస్థాన్‌తో 3,323 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. జమ్ముకశ్మీర్ బ్యాంకుల్లో రూ.1.49 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇవి దేశ డిపాజిట్లలో 0.73 శాతం. అడ్వాన్సులు రూ .73,879 కోట్లు. మొత్తం అడ్వాన్స్‌లలో 0.45 శాతం.

**పంజాబ్‌లో..**

భారత్‌లో మరో ముఖ్యమైన సరిహద్దు రాష్ట్రం పంజాబ్. ఇది పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ తో 547 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. దేశంలోని మొత్తం డిపాజిట్లలో 3 శాతం అంటే రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఈ రాష్ట్రం నుంచి ఉన్నాయి. ఇక రూ.5.35 లక్షల కోట్ల మేర (3.24 శాతం) రుణాలను ఇక్కడి బ్యాంకులు వితరణ చేశాయి.

**రాజస్థాన్**

పాకిస్థాన్ లోని సింధ్, పంజాబ్ ప్రావిన్సుల వెంబడి 1,035 కిలోమీటర్ల ఎడారి సరిహద్దు కలిగిన రాజస్థాన్‌లో రూ.6.98 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు (3.41 శాతం), రూ.6.25 లక్షల కోట్లు (3.79 శాతం) అడ్వాన్సులు ఉన్నాయి.

**గుజరాత్**

సర్ క్రీక్, రాన్ ఆఫ్ కచ్ వెంబడి పాకిస్తాన్ తో 508 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్న గుజరాత్ ఈ రాష్ట్రాలలో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉంది. ఇక్కడి బ్యాంకుల్లో రూ.10.8 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు (5.27 శాతం), రూ.9.45 లక్షల కోట్లు (5.73 శాతం) రుణాలు ఉన్నాయి.

**హిమాచల్ ప్రదేశ్**

పాకిస్థాన్ తో నేరుగా సరిహద్దును పంచుకోనప్పటికీ జమ్మూ కాశ్మీర్, పంజాబ్ లకు దగ్గరగా ఉండటం వల్ల హిమాచల్ ప్రదేశ్ కూడా ఉద్రిక్తతల వలయంలో ఉంది. దేశ డిపాజిట్లలో 0.4 శాతం అంటే రూ.81,840 కోట్లు, అడ్వాన్సుల్లో 0.2 శాతం అంటే రూ.32,736 కోట్లు ఇక్కడి బ్యాంకులకు ఉన్నాయి.




# ఇండిగో కీలక ప్రకటన

## 10 నగరాల్లో విమానాల రద్దు

భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో ప్రముఖ ప్రైవేట్ విమానయాన సంస్థల్లో ఒకటైన 'ఇండిగో' మే 10న రాత్రి 11:59 గంటల వరకు 10 నగరాలకు విమాన సేవలను రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులు తమ బుకింగ్ స్టేటస్ చెక్ చేసుకోవాలని, రీషెడ్యూల్ కోసం కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని ఎయిర్‌లైన్ సూచించింది. రేపు (శనివారం) రాత్రి 11:59 గంటల వరకు శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల, బికనీర్, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, రాజ్‌కోట్‌లకు విమాన సదుపాయం ఉండదు. విమానాలకు రద్దుకు కారణమేమిటనే విషయాన్ని.. ఎయిర్‌లైన్ అధికారికంగా వెల్లడించలేదు. కానీ భారతదేశంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య విమానాలను రద్దు చేసి ఉండొచ్చని సమాచారం. మే 10 తరువాత విమాన సేవలు యధావిధిగా కొనసాగుతాయా?, లేదా మళ్ళీ నిలిపివేస్తారా.. అనే విషయాన్ని ఇండిగో వెల్లడించాల్సి ఉంది.

**ఇలాంటి పరిస్థితిలో ప్రయాణికులు ఏం చేయాలి?**

- అప్డేట్ కోసం కోసం ఇండిగో మెసేజస్ లేదా ఇమెయిల్‌లను చేస్తూ ఉండండి.
- రీషెడ్యూల్ చేయడానికి లేదా రద్దు చేయడానికి ఎయిర్‌లైన్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌ను సందర్శించండి.
- ప్రత్యామ్నాయ ప్రయాణ ఎంపికల కోసం కస్టమర్ సేవను సంప్రదించండి.

**ప్రయాణికులు విమానయాన శాఖ అడ్వైజరీ**

- ఎయిర్‌పోర్ట్‌లకు మూడు గంటల ముందుగానే చేరుకోవాలి.
- 75 నిమిషాల ముందే చెక్ ఇన్ క్లోజ్ అవుతుంది.

# భారత్-పాక్ యుద్ధం..


## నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే శుక్రవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:26 సమయానికి నిఫ్టీ(Nifty) 211 పాయింట్లు నష్టపోయి 24,063కు చేరింది. సెన్సెక్స్(Sensex) 542 పాయింట్లు దిగజారి 79,805 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్(USD Index) 100.81 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 63 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.36 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో గతంతో పోలిస్తే లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.58 శాతం లాభపడింది. నాస్‌డాక్ 1.07 శాతం ఎగబాకింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమవడంతో స్టాక్ సూచీలు ఒడిదొడులకు లోనవుతున్నాయి. ఇటీవల భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా దాడులు చేసిన పాక్‌పై ప్రతీకార చర్యగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు భారత రక్షణ శాఖ ప్రకటనతో దలాల్ స్ట్రీట్ సెంటిమెంట్ నిన్న ఒక్కసారిగా మారిపోయింది. ట్రేడింగ్ మరో గంటలో ముగుస్తుందనే సమయంలో ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో భారీ విక్రయాలు తలెత్తాయి. అమెరికాతో చైనా, తాజాగా బ్రిటన్ వాణిజ్య ఒప్పంద చర్చలు సఫలం అవ్వొచ్చనే అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. పరస్పర దాడులకు సంబంధించిన పరిస్థితులు త్వరగా సద్దుమనిగితే మార్కెట్ ప్రభావం పరిమితం కావచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఈ ఆపరేషన్ స్టాక్ మార్కెట్‌పై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని కొందరు చెబుతున్నారు. పరిస్థితులు త్వరితగతిన నియంత్రణలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం. ఇలాంటి ఆపరేషన్ల ప్రభావానికి తాత్కాలికంగా మార్కెట్లు ఒడిదొడులకులకు లోనైనా భవిష్యత్తులో తప్పకుండా పెరుగుతాయని స్పష్టం చేస్తున్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# భారత్-పాక్ యుద్ధంపై చైనా రియాక్షన్



భారత్‌పాక్ యుద్ధంపై చైనా స్పందించింది. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆ దేశం ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాకిస్థాన్‌ల మధ్య జరుగుతున్న సైనిక దళాల ఘర్షణపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ.. భారత్‌పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా కానీ చైనా వ్యతిరేకిస్తుందంటూ ఆయన స్పష్టం చేశారు. పొరుగు దేశాలైన భారత్‌పాక్ అంతర్జాతీయ చట్టాలను పాటిస్తూ.. శాంతి, స్థిరత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని కోరారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి.. అంతర్జాతీయ సమాజంతో కలిసి.. నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. కాగా, భారత్-పాకిస్తాన్ మధ్య ఘర్షణలు పూర్తిగా ఆగిపోవాలని కోరుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించిన సంగతి తెలిసిందే. ఇరు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్టుగా భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. మొదట ఉగ్రవాదులు దాడి చేశారు కాబట్టి తర్వాత భారత సైన్యం ప్రతిదాడి చేసిందని పరోక్షంగా అంగీకరించారు. ఇప్పటిదాకా జరిగింది చాలు, ఇకనైనా ఘర్షణలకు తెరదించాలని భారత్, పాక్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని సూచించారు. భారత్, పాక్ మధ్య శాంతి కోసం తాను చేయగలిగినదంతా చేస్తానని ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. తన విజ్ఞప్తిని మన్నించి దాడులకు తెరదించాలని భారత్, పాక్‌లకు సూచించారు.

# పాకిస్థాన్‌కు ఆర్థిక సంకెళ్లు?




**ఢిల్లీ:** పాకిస్తాన్ బెయిల్ ఔట్ ప్యాకేజీపై అంతర్జాతీయ ద్రవ్య నిధి బోర్డు (IMF) ఆలోచనలో పడింది.. 1.3 బిలియన్ డాలర్ల అప్పు ఇవ్వాలా ? వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకోనుంది. కాసేపట్లో ఐఎంఎఫ్ సమావేశం కానుంది. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ అప్పు ఇవొద్దని భారత్ కోరుతోంది. పాకిస్థాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో బెయిల్ అవుట్ ప్యాకేజ్ నిధులు విడుదల చేయవద్దని భారత డిమాండ్ చేస్తోంది.

పాకిస్థాన్‌కు నిధులు విడుదల చేస్తే అవి ఉగ్రవాదులకు చేరుతాయని భారత్ స్పష్టం చేసింది. ఉగ్ర స్థావరాలను ఏర్పాటు చేసి భారత్‌పైకి ఎగదోస్తున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకి చేయడమనే లక్ష్యంగా ఇండియా పావులు కదుపుతోంది. మరో వైపు, పాకిస్థాన్ ఐఎంఎఫ్ నుంచి తీసుకున్న నిధులను దారి మళ్లిస్తున్నట్టు తగిన ఆధారాలను కూడా భారత్ సమర్పించిన సంగతి తెలిసిందే.

కాగా, ఆపరేషన్ సిందూర్ దాడిలో హతమైన ఉగ్రవాదులకు పాకిస్థాన్ సైన్యం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటంపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పనులు ఆ దేశానికి అలవాటుగా మారాయని మండిపడింది. ఆపరేషన్ సిందూర్‌పై గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. పాక్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది నాయకత్వంలో ఆ దేశ సైన్యం, పోలీసులు ఉగ్రవాదుల మృతదేహాలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫొటోలను ప్రదర్శించారు.

ఇలాంటి చర్యలతో పాకిస్తాన్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. భారత్ దాడుల్లో సాధారణ పౌరులు మరణించారన్న పాకిస్తాన్ ప్రకటనను ఖండించారు. 'దాడుల్లో నిజంగా సామాన్య పౌరులే మరణిస్తే.. మరి ఈ ఫొటోలో ఉన్నదేమిటి? సామాన్యుల మృతదేహాలను శవపేటికల్లో పెట్టి.. వాటిపై పాకిస్తాన్ జాతీయ జెండాలు కప్పి, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారా?'అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

తమ దాడుల్లో చనిపోయినవాళ్లంతా ఉగ్రవాదులేనని స్పష్టంచేశారు. 'ఉగ్రవాదంతో మలినమైన చేతులను కడుక్కొనేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులే లేరని ఆ దేశ సమాచార శాఖ మంత్రి ఓ టీవీ చర్చలో ప్రకటించారు. కానీ, ఆ చర్చలోనే ఆయన తన ప్రకటనకు గట్టి సవాలు ఎదుర్కొన్నారు. ఉగ్రవాదానికి పాకిస్తానే కేంద్ర స్థానమని అనేక సందర్భాల్లో నిరూపణ అయ్యింది. ఇందుకు సంబంధించిన ఆధారాలు భారత్‌తోపాటు అనేక దేశాల వద్ద ఉన్నాయి'అని మిస్రీ పేర్కొన్నారు.

# దెబ్బ మీద దెబ్బ..

## భారత్ దాడులతో పాక్ బెంబేలు



పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఒక్క పక్క భారత ఆర్మీదాడులతో పాక్ బెంబేలెత్తిపోతుండగా.. మరో పక్క బీఎల్ఏ దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తెహ్రిక్ఇతాలిబన్ దాడుల్లో 20 మంది పాక్ సైనికులు హతమయ్యారు. ఇదిలా ఉండగా, పాక్ ప్రధానిని ఆ దేశ ఎంపీలు టార్గెట్ చేశారు. పాక్ పార్లమెంట్ సాక్షిగా ప్రధాని షెహబాజ్‌పై విమర్శలు గుప్పించారు. షెహబాజ్ పిరికిపంద అంటూ పాక్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత సైన్యం దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్‌లో సామాన్యులతో పాటు చట్టసభల సభ్యులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. సైనిక రిటైర్డ్ మేజర్, సీనియర్ ఎంపీ అయిన తాహిర్ ఇక్బాల్ ఆ దేశ పార్లమెంటులోనే ఏకంగా ఏడ్చేశారు. అధికార పార్టీ ఎంపీ అయిన ఇక్బాల్.. పార్లమెంటులో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ఇస్లామాబాద్‌లోని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఇంటి సమీపంలో భారత్ దాడులకు దిగింది. దీంతో తన నివాసం నుంచి పాక్ ప్రధాని పరారైనట్లు సమాచారం.

హెచ్‌క్యూ-9పీ, హెచ్‌క్యూ-9బీఈ, ఎఫ్ డీ- 2000, హెచ్‌క్యూ-16ఎఫ్ఈ గగనతల రక్షణ వ్యవస్థలపై పాక్ ఆధారపడుతోంది. వీటితోపాటే పాతతరం ఎల్‌వై-80, ఎఫ్ఎం-90 రకాలూ ఎంతోకొంత పాక్‌కు సాయపడుతున్నాయి. 40 కిలోమీటర్ల స్థాయిలో లక్ష్యాలను ఛేదించడానికి ఎల్‌వై-80ను పాక్ వాడుతోంది. మే 7వ తేదీ అర్ధరాత్రి దాటాక భారత్ చేసిన దాడిలో హెచ్‌క్యూ-16 వ్యవస్థ నాశనమైంది. చైనా నుంచి 2021లో హెచ్‌క్యూ-9పీ దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థను దిగుమతి చేసుకుంది. తమ గగనతలంలోకి వచ్చిన శత్రు క్షిపణులను 125 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి నేలమట్టంచేయగలదు. యుద్ధ విమానాలనూ అడ్డుకోగలదు.

# మోదీని కలిసిన వరల్డ్ బ్యాంక్ చీఫ్

## సింధు జలాల ఒప్పందంపై..



భారత్ పాకిస్తాన్ ఉద్రిక్తతల వేళ సింధు జలాల నిలిపివేతపై స్పందిస్తూ.. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోవడం లేదని వరల్డ్ బ్యాంక్ చీఫ్ 'అజయ్ బంగా' స్పష్టం చేశారు. మా పాత్ర కేవలం ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుందని అన్నారు. భారతదేశంలో పర్యటిస్తున్న అజయ్ బంగా.. గురువారం దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. అదే రోజు ఉత్తరప్రదేశ్ మ్యాఖ్యమంత్రి 'యోగి ఆదిత్యనాథ్'ను కలిసిన తరువాత అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రపంచ బ్యాంక్ అధినేతగా పదవిని స్వీకరించిన తొలి భారతీయ అమెరికన్ సిక్కుగా రికార్డ్ క్రియేట్ చేసిన బంగా.. ఇండియా పాకిస్తాన్ యుద్ధం సమయంలో మన దేశంలో పర్యటించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. 1960లో సింధు జలాల పంపకంపై భారతదేశంపాక్ మధ్య చాలా కాలంగా కొనసాగుతున్న వివాదంలో ప్రపంచ బ్యాంకు జోక్యం చేసుకుంది. ఆ సమయంలో రెండు దేశాలు ఒప్పందంపై సంతకం చేయడానికి సహాయపడింది. ఈ ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు, రెండు దేశాల ఇంజనీర్లు.. ప్రపంచ బ్యాంకు మధ్య సంప్రదింపులు, రాజకీయ కుతంత్రాలను అధిగమించడానికి తొమ్మిది సంవత్సరాలు పట్టింది. అయితే ఇప్పుడు ఈ ఒప్పందంలో మేము జోక్యం చేసుకోవడం లేదని ఆయన స్పష్టం చేసారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 10-05-2025
ANN తెలుగు



## ప్రేమ కబుర్లు?

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది జూన్ 20న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమాపోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ధనుష్, రష్మిక మాట్లాడుకుంటున్న ఓ కొత్తపోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ధనుష్, రష్మిక చిరునవ్వులు చిందిస్తూ, ఏవో ప్రేమ కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా ఈపోస్టర్ ఉంది. తమిళ్, తెలుగు,హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

## భారత సైన్యానికి హీరో విజయ్ దేవరకొండ విరాళం

యంగ్ హీరో విజయ్ దేవరకొండ మంచి మనసు చాటుకున్నాడు. ప్రస్తుతం భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే భారత సైన్యానికి పలువురు విరాళాలు ఇస్తున్నారు. తన వంతు బాధ్యతగా ఇప్పుడు విజయ్ కూడా విరాళం ప్రకటించాడు. రాబోయే కొన్ని వారాల పాటు తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాల్లో వచ్చే లాభాల్లోని కొంత వాటాని భారత సైన్యానికి విరాళం ఇవ్వబోతున్నట్లు విజయ్ దేవరకొండ చెప్పాడు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు మేడ్ ఫర్ ఇండియా అని తన సోషల్ మీడియాలో షేర్ చేశాడు. విజయ్ దేవరకొండ నటించిన కింగ్డమ్ మూవీ ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రమోషన్ అసలు చేస్తారా లేదా? సినిమా విడుదల కూడా ఉంటుందా లేదా అనేది చూడాలి?




## మంచు మనోజ్.. కన్నప్పతో పోటీ పడట్లేదు



కొన్నిరోజుల క్రితం మంచు ఫ్యామిలీలో గొడవలు జరిగాయి. ప్రస్తుతం అంతా సైలెంట్ గా ఉన్నారు. అయితే వివాదం నడుస్తున్న టైంలో కన్నప్ప గురించి మనోజ్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. తన సినిమాకు భయపడే విష్ణు 'కన్నప్ప' వాయిదా వేశాడని చెప్పుకొచ్చాడు. అసలు విషయానికొస్తే.. ఏప్రిల్ 25న వస్తుందనుకున్న కన్నప్ప సినిమాని జూన్ 27కి వాయిదా వేశారు. ఇదే టైంలో మంచు మనోజ్ 'భైరవం' కూడా చాలారోజులుగా వాయిదా పడుతూ వస్తోంది. లెక్క ప్రకారం గత డిసెంబరులోనే రిలీజ్ ప్లాన్ చేశారు. మరి ఓటీటీ డీల్ కుదరకపోవడమే, మరేదైనా కారణాలు తెలియదు గానీ రిలీజ్ లేటు చేస్తూ వచ్చారు. ఫైనల్‌గా ఇప్పుడు కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మే 30న థియేటర్లలోకి వస్తామని పోస్టర్ రిలీజ్ చేశారు. అంటే మనోజ్ ఆశపడ్డట్లు ఈసారి అన్న విష్ణు 'కన్నప్ప'తో పోటీ పెట్టుకోలేదు. అదే టైంలో విజయ్ దేవరకొండ 'కింగ్డమ్'కి పోటీగా బరిలో నిలిచారు. మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మినీ మల్టీస్టారర్ కి విజయ్ కనకమేడల దర్శకుడు. డైరెక్టర్ శంకర్ కూతురు అదితీ ఈ సినిమాతోనే టాలీవుడ్ లోకి హీరోయిన్ గా పరిచయమవుతోంది. తమిళ హిట్ 'గరుడన్'కి రీమేక్ దీన్ని తెరకెక్కించడం విశేషం.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



## ఐపీఎల్- 2025 వాయిదా

- వారం రోజుల పాటు పోస్ట్‌పోన్
- భారత్, పాక్ ఉద్రిక్తతల మధ్య బీసీసీఐ నిర్ణయం

**మహా, స్పోర్ట్స్:** భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధం కారణంగా బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్2025 ను నిరవధికంగా వాయిదా వేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్ణయించింది. అభిమానులు, ఆటగాళ్ల భద్రత దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గిన తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించే అవకాశం ఉంది. మే 8 ధర్మశాల స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్ భద్రతా కారణాల దృష్ట్యా రద్దు చేయబడిన సంగతి తెలిసిందే. పంజాబ్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలు పాకిస్థాన్ నుంచి దాడికి గురవుతున్నందున రద్దు చేయబడింది. ఐపీఎల్ 2025 సీజన్ నిలిపివేయబడిందని బీసీసీఐ పేర్కొంది. పరిస్థితిని సమీక్షించడంతో పాటు భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## పాకిస్థాన్‌కు మరో షాక్..

### క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతివ్వని యూఏఈ..!

పాకిస్థాన్‌కు వరుసగా షాక్‌లు తలుగుతున్నాయి. భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' (Operation Sindoor)తో ఉగ్రస్థావరాలు నేలమట్టం కాగా.. 400లకు పైగా డ్రోన్లు తునాతునకలయ్యాయి. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(PCB)కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(UAE) ప్రభుత్వం ఊహించని ఝలక్ ఇచ్చింది. పాకిస్థాన్ సూపర్ లీగ్(PSL 2025) మ్యాచ్‌లను తమ దేశంలో నిర్వహించేందుకు ఆసక్తి చూపిండం లేదు. భారత్‌తో ఉద్రిక్తతల నడుమ తాము పాక్ బోర్డు విన్నపాన్ని తోసిపుచ్చేందుకు ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ECB) సిద్ధమైంది. దాంతో, ఏమి చేయాలో పాలుపోక పీసీబీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం(Indian Army) చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో పాక్ ఉలిక్కి పడింది. అత్యాధునిక ఆయుధాలతో ఇండియన్ సైన్యం చేస్తున్న దాడులకు జడిసిన దాయాది దేశం.. పీఎస్ఎల్‌ను యూఏఈకి తలరించాలని అనుకుంది. ఇదే విషయమైన ఎమిరేట్స్ క్రికెటర్ల యూఐఈ వేదికగా తరలించాలని భావించింది. కానీ, ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు మాత్రం అందుకు ససేమిరా అంటోంది. ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ సమయంలో తాము పీఎస్ఎల్‌కు ఆతిథ్యం ఇవ్వడం సరికాదని యూఏఈ ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ పీసీబీ ప్రతిపాదనకు అంగీకరిస్తే.. కొన్నాళ్లుగా భారత క్రికెట్




నియంత్రణ మండలితో తమకున్న సఖ్యత ఎక్కడ దెబ్బతింటుందేమోనని అరబ్ దేశం ఆలోచిస్తోంది.

**బీసీసీఐతో సత్సంబంధాలు**

'గత కొంత కాలంగా ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుకు బీసీసీఐతో సత్సంబంధాలు ఉన్నాయి. 2021లో టీ20 వరల్డ్ కప్‌తో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లు ఇక్కడ జరిగాయి. ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఇక్కడే ఆడింది. అందుకే.. మాకు బీసీసీఐతో స్నేహం చెడడం ఇష్టం లేద'ని ఎమిరేట్స్ బోర్డు ప్రతినిధులు అంటున్నారు. పైగా.. ఐసీసీ(ICC) ప్రధాన కార్యాలయం దుబాయ్‌లో ఉంది. బీసీసీఐకి సెక్రటరీగా సేవలందించిన జై షా (Jai Shah) ప్రస్తుతం ఐసీసీ ఛైర్మన్‌గా ఉన్నాడు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఆ దేశ బోర్డు.. పీఎస్ఎల్ మ్యాచ్‌లకు నో చెబుతోంది.

## సైన్యానికి మద్దతుగా.. నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ వాయిదా..!

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పలు ఆటలు రద్దు అవుతున్నాయి. ఇప్పటికే ఐపీఎల్ 18వ సీజన్‌ను బీసీసీఐ వారం రోజులు వాయిదా వేసింది. ఈ పరిస్థితుల్లో జావెలెన్ త్రోయర్ నీరజ్ చోప్రా (Neeraj Chopra) కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన పేరిట తొలిసారి నిర్వహించ తలపెట్టిన 'నీరజ్ చోప్రా క్లాసిక్'(NC Classic) ఈవెంట్‌ను సైతం వాయిదా వేస్తున్నట్టు చెప్పాడు. ఈ విషయాన్ని శుక్రవారం సాయంత్రం అతడు వెల్లడించాడు. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపాడీ బడిసె వీరుడు. షెడ్యూల్ ప్రకారం మే 24న బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో నీరజ్ చోప్రా క్లాసిక్ టోర్నమెంట్ జరగాల్సి ఉంది. అయితే.. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' (Operation Sindoor)తో పరిస్థితులు మారిపోయాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తత.. విమాన సంస్థలు సర్వీస్‌లు నిలిపివేయడం వలన టోర్నీ నిర్వహణ సాధ్యపడదని గ్రహించిన చోప్రా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించాడు. 'ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా నీరజ్ చోప్రా క్లాసిక్ టోర్నీని వాయిదా వేస్తున్నాం. ఈ నిర్ణయం హఠాత్తుగా తీసుకున్నది కాదు. అందరితో చర్చించాకే వాయిదానే మంచిదని అనుకున్నాం. తదుపరి కొత్త తేదీలను వెల్లడిస్తాం. ఉద్రిక్తత వాతావరణం నడమ సైనికులు, దేశానికి మద్దుతుగా నిలవడం ముఖ్యమని భావించాం. ఈ కఠిన సమయంలో మా అందరి ప్రార్థనలు భారత సైన్యం చుట్టేనే తిరుగుతుంటాయి. జై హింద్' అని ఎక్స్ పోస్ట్ ద్వారా వివరించాడు నీరజ్.




**నదీమ్‌కు ఆహ్వానంపై..**

ఏప్రిల్ నెలలోనే చోప్రా ఈ పోటీల గురించి ప్రముఖ అథ్లెట్లకు ఆహ్వానాలు పంపాడు. ఈ క్రమంలోనే జావెలిన్ త్రోయర్.. స్నేహితుడు అయిన అర్షద్ నదీమ్ (Arshad Nadeem)ను భారత్‌కు రావాల్సిందిగా చోప్రా ఆహ్వానించాడు. అయితే.. పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత నెటిజన్లు కొందరు చోప్రాను టార్గెట్ చేశారు. శత్రు దేశం అథ్లెట్‌ను పోటీలకు పిలుస్తావా? అతడిపై ట్రోలింగ్ చేశారు. అందుకు ఎంతగానో బాధపడిన నీరజ్ విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చాడు. రెండు ఒలింపిక్ పతకాలు అందించిన తన దేశభక్తిని శంకించాల్సిన అవసరం లేదని, అందరూ ఆటగాళ్లను పిలిచినట్టుగానే నదీమ్‌కు కబురు పంపానని చెప్పాడు.

## భారీ భద్రత నడుమ రైల్వే స్టేషన్‌కు.. ఢిల్లీ బయల్దేరిన క్రికెటర్లు..!

ఐపీఎల్ మ్యాచ్‌లను వారం పాటు వాయిదా వేసిన బీసీసీఐ ఆటగాళ్ల భద్రతకు పెద్ద పీట వేస్తోంది. అందులో భాగంగానే ధర్మశాలలో చిక్కుకుపోయిన ఢిల్లీ క్యాపిటల్స్(Delhi Capitals), పంజాబ్ కింగ్స్(Punjab Kings) క్రికెటర్లను సురక్షితంగా ఢిల్లీకి తరలిస్తోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వందే భారత్ రైలులో భారీ భద్రత నడుమ ప్లేయర్లు, సహాయక సిబ్బంది, అంపైర్లు.. మీడియా బృందం అందరూ ఢిల్లీకి వెళుతున్నారు. టీమ్ హోటల్‌లో ఉన్న ఇరుజట్ల ఆటగాళ్లు, సిబ్బందిని శుక్రవారం పోలీసులు గట్టి బందోబస్త్ మధ్య ధర్మశాల నుంచి జలంధర్ రైల్వే స్టేషన్‌కు తరలించామని ఎస్పీ షాలినీ అగ్నిహోత్రి(Shalini Agnihotri) వెల్లడించింది. 'శుక్రవారం ఉదయం పంజాబ్, ఢిల్లీ జట్ల ఆటగాళ్లు, సహాయక సిబ్బంది.. బ్రాడ్‌కాస్టింగ్ బృందాన్ని గ్రూప్‌లుగా జలంధర్ తరలించాం. 40 నుంచి 50 చిన్న వ్యాన్లలో భారీ భద్రత నడుమ వీళ్లను పంజాబ్ సరిహద్దులోని హోషియాపూర్‌కు తీసుకొచ్చాం. క్రికెటర్లు, ఇతర సిబ్బందితో కూడిన కాన్వాయ్‌కు కంగ్రా పోలీసులు, పంజాబ్ పోలీసులు రక్షణగా ఉన్నారు. హోషియాపూర్ చేరుకున్నాక ప్లేయర్లను జలంధర్‌కు సురక్షితంగా తరలించాం. బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో క్రికెటర్లు వాళ్ల సహాయక సిబ్బందిని ఎక్కించాం' అని షాలినీ తెలిపింది.

**20 నిమిషాల్లోనే ఖాళీ**

ఢిల్లీ, పంజాబ్ జట్ల మధ్య ధర్మశాలలో గురువారం జరిగిన మ్యాచ్ అర్ధాంతరంగా రద్దు అయింది. పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్ వద్ద ఫ్లడ్ లైట్స్ పని చేయలేదు. అప్పటికే సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల దాడిని భారత సైన్యం సమర్ధంగా తిప్పికొడుతోంది. దాంతో, జమ్మూసహా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ మ్యాచ్‌ను రద్దు చేసింది. ఆ వెంటనే ఇరుజట్ల ఆటగాళ్లు, సిబ్బందిని భద్రత నడుమ సురక్షితంగా టీమ్ హోటల్‌కు తరలించిన పోలీసులు.. 20 నిమిషాల్లోనే స్టేడియం మొత్తాన్ని ఖాళీ చేయించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com